**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 48, పేజీలు - 08

గురువారం, ఆగష్టు 13, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# కల్తీ పన్నీర్‌పై అధికారి 'కావ్య' మౌనమెందుకు?




- కల్తీ ఆహారలపై సమాచారం ఇచ్చినా స్పందన లేదు
- ఆఫీసర్ తనిఖీకి వెళ్లినా.. అంతా సక్రమమేనా.?
- ఆటో ట్రాలీలో పన్నీర్ ప్యాకింగ్ చేయడమేంటి.. తప్పు కాదా.?
- ఫుడ్ ఇన్స్పెక్టర్ల బాధ్యతారాహిత్యంపై కమిషనర్ చర్యలు తీసుకునేనా.?
- ఫుడ్ ఇన్స్పెక్టర్ల నిర్లక్ష్యంతోనే నగరంలో కల్తీ ఆహార పదార్థాల జోరు!




హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రోజులు మారుతున్నాయి, చట్టాలు కఠినమవుతున్నాయి, కల్తీ ఆహారంపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతోంది. అయిన నగరంలో కల్తీ పన్నీర్ దందా మాత్రం రోజురోజుకూ మరింత విస్తరిస్తుందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఒకవైపు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కల్తీ ఆహార పదార్థాలపై కఠిన చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో మరోవైపు ఫుడ్ ఇన్స్పెక్టర్ లు, ఆహార భద్రత అధికారుల వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న కల్తీ ఆహార సరఫరాల వ్యవహారాలపై సమాచారం అందించినా ఫుడ్ ఇన్స్పెక్టర్ లలో కనీస స్పందన లేకపోవడం ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

### ఫోన్ చేసినా స్పందించని అధికారి..

ఉప్పల్ సర్కిల్ పరిధిలో హబ్సిగూడ స్ట్రీట్ నంబర్-8లో ఆటో ట్రాలీలో పన్నీర్ ప్యాకింగ్ చేస్తున్నారన్న సమాచారం అందడంతో రిపోర్టర్లు సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించి, ఫుడ్ ఇన్స్పెక్టర్ కావ్యను సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నాలు చేసినారు. అయితే ఫుడ్ ఇన్స్పెక్టర్ మాత్రం ఫోన్‌కు స్పందించలేదని గతంలో కూడా ఎన్నిసార్లు ఫోన్ చేసిన అసలు ఫోన్ ఎత్తరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యవసర సమాచారం అధికారికి అందితే.. ఒక బాధ్యత గల అధికారిగా వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఫోన్‌కే స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమా.? నిర్లక్ష్యమా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఆటోలో ప్యాకింగ్.. నిబంధనలు ఎక్కడ.?

హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8 కి చేరుకున్న తర్వాత పన్నీర్ ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించినప్పటికీ అన్నీ సక్రమంగానే ఉన్నాయని అధికారి చెప్పినట్లు సమాచారం. అయితే ప్యాకెట్లపై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ, బరువు వంటి కీలక వివరాలు ప్రింట్ చేయలేదని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాలను విక్రయించే ముందు వినియోగదారులకు అవసరమైన సమాచారాన్ని అందించడం అత్యంత కీలకం. అలాంటప్పుడు ప్యాకేజింగ్ విధానం, లేబులింగ్, పరిశుభ్రత, తయారీ ప్రదేశం తదితర అంశాలపై సమగ్ర తనిఖీ జరిగిందా.? ఆటోలో పన్నీర్ ప్యాకింగ్ చేయవచ్చా దీనిపై ఇప్పుడు ఇన్స్పెక్టర్ తనిఖీలు చేశారు.? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

### 'ఓకే' అనడం వెనుక అసలు కారణమేంటి.?

ఆహార భద్రత నిబంధనల ఉల్లంఘన ఏమీ లేకపోతే.. తనిఖీ సమయంలో ప్యాకింగ్ ప్రక్రియ, పన్నీర్ తయారీకి ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, నిల్వ విధానం, ప్యాకేజింగ్ వివరాలు, లేబులింగ్ తదితర అంశాలను ఫుడ్ ఇన్స్పెక్టర్, పోలీసు అధికారులు స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. అయితే స్ట్రీట్ నెంబర్ 8లో ఆటోలో ప్యాకింగ్ చేసే పన్నీరుకు ఇవన్నీ లేకున్నా ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎలా ఓకే చెప్పారు. పూర్తి సరుకును మార్కెట్లోకి ఎలా పంపారు అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇవన్నీ లేకున్నా ఆ ఆటోలో సరుకును వదిలిపెట్టడం వెనుక అంతర్యం ఏమిటి.? క్షేత్రస్థాయిలో జరిగిన అధికారుల వ్యవహారంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క రూపాయి విలువచేసే చాక్లెట్ కే కవర్ పైన బ్యాచ్ నెంబర్, తయారు తేదీ, ఎక్స్పైరి తేదీ, బరువు వంటి ఇతర సమాచారం ఉంటుంది. సాధారణ ప్రజలకు వీటిపై అవగాహన ఉంది కానీ ప్రభుత్వ ఉద్యోగులైన అధికారులకు కనీస నిబంధనలను కూడా గుర్తించలేదా.? మరి గుర్తించి కావాలనే వదిలివేసారా.? ఇందులో అంతర్యం ఏమిటి.? అన్నదానిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు. వీడియోలు, ఫోటోలు ఉన్న తర్వాత కూడా అధికారులు అన్నీ సక్రమంగా ఉన్నాయని చెప్పిన పరిస్థితుల్లో ఆ నిర్ణయానికి ఆధారాలేమిటి.? నమూనాలు సేకరించారా.? ప్రయోగశాల పరీక్షలకు పంపారా.? కంపెనీ నుంచి వచ్చిన బిల్లు ఉందా పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించారా.? అన్న ప్రశ్నలకు ఫుడ్ ఇన్స్పెక్టర్, పోలీసు అధికారుల నుండి సమాధానాలు రావాల్సి ఉంది.

### ఉన్నతాధికారుల మౌనం ఎందుకు.?

కల్తీ ఆహారంపై సమాచారం ఇచ్చినప్పుడు సంబంధిత అధికారులు స్పందించకపోతే క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎలా జరుగుతాయి.? ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం లేదా.? ఇప్పుడు ఇన్స్పెక్టర్లు ఎందుకు ప్రజల ఫోన్లు ఎత్తడం లేదు. ఫోన్ ఎత్తకపోవడం వెనుక అంతర్యం ఏమిటి.? ఫోన్ ఎత్తని అధికారులపై ఉన్నత అధికారులు కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో.? అన్న చర్చ మొదలైంది. అధికారులపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

### టన్నుల కొద్దీ పన్నీర్ ఎక్కడి నుంచి వస్తోంది.?

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో విస్తృతంగా పన్నీర్ ఎలాంటి ప్యాకింగ్ లేకుండా, ఆహార భద్రత నియమాలు పాటించకుండా అందుబాటులో ఉండటంపై కూడా పలు ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పన్నీర్ తయారీకి అవసరమైన స్థాయిలో పాల ఉత్పత్తి లేకపోయినా భారీగా పన్నీర్ సరఫరా అవుతుంటే.. దాని తయారీ కేంద్రాలు ఎక్కడున్నాయి.? ముడి పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి.? ఎవరు తయారు చేస్తున్నారు.? ఎంతకాలం నుండి తయారుచేస్తున్నారు.? ఏ మార్గంలో నగరానికి చేరుతోంది.? ఆ మార్గాలలో అధికారులు తనిఖీలు ఎందుకు చేయడం లేదు.? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని బాధితులు కోరుతున్నారు.

### కల్తీపై కఠిన చర్యలు ఎక్కడ.?

కల్తీ పన్నీర్ ప్రజల ఆరోగ్యంను ఎలా దెబ్బతీస్తుంది. దానివల్ల ఎలాంటి వ్యాధులు వస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు వాటిని తినడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్యాలు చేకూరుతాయి, అనుమానాస్పద ఉత్పత్తులను పరీక్షించకుండా 'సక్రమమే' అని ఫుడ్ ఇన్స్పెక్టర్లు తేల్చడం సరైన విధానమా.? అన్నది ఉన్నతాధికారులు, కమిషనర్, ప్రభుత్వం పరిశీలించాలి. మరి హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లో ఫుడ్ ఇన్స్పెక్టర్ కావ్య ఎందుకు చర్యలు తీసుకోలేదు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార భద్రత విషయంలో ఏ చిన్న నిర్లక్ష్యాన్నీ తేలికగా తీసుకోకూడదు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం చాలా సీరియస్ గా ఉన్నారు.

### కమిషనర్ చర్యలు తీసుకునేనా.?

కల్తీ పన్నీర్ వ్యవహారంపై వస్తున్న ఆరోపణలు, ఫుడ్ ఇన్స్పెక్టర్ స్పందనపై ఉన్న ప్రశ్నలు, ఆటోలో ప్యాకింగ్, లేబులింగ్ లోపాలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. బాధ్యులు ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిజానిజాలు తేల్చేందుకు ఫుడ్ ఇన్స్పెక్టర్లు, విజిలెన్స్ అధికారులు తనిఖీ రికార్డులు, నమూనా పరీక్షలు, ప్యాకేజింగ్ వివరాలు, సరఫరా మార్గాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మున్సిపల్ వ్యవస్థపైనే ప్రజలకు అనుమానం కలిగే పరిస్థితి రాకుండా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపితే సహకరిస్తాం

**- ఎగవేతలకు ప్రయత్నిస్తే కఠినంగా ఉంటామన్న సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలకు అవకాశం ఇచ్చి.. తిరిగి ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

2లో..

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా

3లో..

## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో కీలక మార్పు
- ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడమే లక్ష్యం
- నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చన్న సీఎం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఈ ఏడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సీఎం

2లో..

## కర్ణాటకలో మంత్రులకు శాఖలు కేటాయింపు

**- డీకే వద్దే ఫైనాన్స్, ఇంటెలిజెన్స్, బెంగళూరు డెవలప్‌మెంట్**



**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)**వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా.. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన మంత్రివర్గంలోని 23 మంది మంత్రులకు శాఖలను కేటాయించారు. ఆగస్టు 3న డీకే తన క్యాబినెట్‌ను విస్తరించిన విషయం తెలిసిందే. ఆర్థిక, మంత్రివర్గ వ్యవహారాలు, సిబ్బంది-పరిపాలనా సంస్కరణలు, నిఘా విభాగం, సమాచార శాఖ, న్యాయ, శాసనసభ వ్యవహారాలు, వ్యవసాయ మార్కెటింగ్, పట్టణ గ్రామీణ ప్రణాళిక, బెంగళూరు నగరాభివృద్ధి వంటి కీలక శాఖలను డీకే తన వద్దే అట్టిపెట్టుకున్నారు. వీటితో పాటు ఇతరులకు కేటాయించని శాఖలను కూడా ఆయనే నిర్వహించనున్నారు.

### మంత్రులు- వారి శాఖలు

యూటీ ఖాదర్‌కు మైనారిటీ సంక్షేమం, హజ్ వక్ఫ్, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం శాఖలను కట్టబెట్టారు. ఆర్. రామలింగారెడ్డి అటవీ, పర్యావరణ శాఖలను నిర్వహించనుండగా, కే హెచ్ మునియప్పకు సాంఘిక సంక్షేమాన్ని కేటాయించారు. బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్- గృహనిర్మాణం, లక్ష్మణ్ సవాడి- సహకార శాఖ (వ్యవసాయ మార్కెటింగ్ మినహా), రుద్రప్ప మనప్పలమణి- చక్కెర వస్త్ర పరిశ్రమ,

3లో..

# నేరాల రూపం మారింది.. పోలీసింగ్ మారాలి

## - పోలీసులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం, స్వభావం పూర్తిగా మారిపోయాయని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేరం జరిగిన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో కీలక ఆధారాలు చేజారిపోకుండా చూడటమే నేర నియంత్రణలో మొదటి విజయమని ఆయన పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం సచివాలయం నుంచి రాష్ట్ర డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,650 మంది అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ స్థాయి వరకు ఒకేసారి ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీసుల కీర్తి దేశవ్యాప్తంగా మార్మోగాలని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం

ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు అత్యంత కీలకమని చంద్రబాబు అన్నారు. "రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఒక గర్వకారణం. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా మీరంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీస్, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి" అని ఆయన సూచించారు. 2019-24 మధ్య పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని రాష్ట్రానికి పెను సమస్యగా మార్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని, వారి గౌరవం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 14,770 ప్రభుత్వ సీసీ కెమెరాలతో పాటు, ప్రైవేటు వ్యక్తుల కెమెరాలను కలిపి మొత్తం లక్ష కెమెరాలను నేర నియంత్రణ కోసం అనుసంధానించామని తెలిపారు. ఫేస్ రికగ్నిషన్, డీఎన్‌ఏ డిటెక్షన్ వంటి ఆధునిక టెక్నాలజీతో నేరాలను వేగంగా ఛేదిస్తున్నామని అన్నారు.

### వివేకా కేసులో అది కాస్ట్ లీ మిస్టేక్

రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. "పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మోటార్ సైకిల్ విన్యాసాలు, విశాఖలో మూడు గంటల పాటు రోడ్లు దిగ్బంధించడం వంటివి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒకే పార్టీకి చెందిన వారు. ఏ పార్టీకి కూడా చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ లేదు" అని చంద్రబాబు హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలను చెరిపేసే ప్రయత్నం జరగడం పోలీసుల వైపు నుంచి జరిగిన అత్యంత ఖరీదైన తప్పిదం (కాస్ట్ లీ మిస్టేక్) అని అన్నారు. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించడంలో వైఫల్యం ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఘటనే నిదర్శనమని, నేరస్తుల పట్ల ఉదాసీనత వద్దని స్పష్టం చేశారు.

### ఇకపై నెలవారీ పెర్ఫార్మెన్స్ రిపోర్ట్

శాంతిభద్రతల విషయంలో ఏపీని దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలపాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఇకపై ప్రతీ నెలా పోలీసు శాఖ పనితీరుపై ఒక పెర్ఫార్మెన్స్ రిపోర్టును విడుదల చేయాలని ఆదేశించారు. దీని ద్వారా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని, సక్సెస్ స్టోరీలను ప్రజలకు వివరించవచ్చని అన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని, అదే సమయంలో సంఘ విద్రోహ శక్తులకు పోలీసులంటే భయం కలగాలని సూచించారు. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానం కొనసాగుతుందని, 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి ప్రచారాలతో గంజాయి, మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు.
రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, ప్రమాదాల నివారణకు రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌ల ఆడిట్‌పై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీస్ స్టేషన్ల నుంచి శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాల అధికారులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు

## - నాణేనికి మరో వైపు చూపిస్తామన్న జగన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు.

### పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు

ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకాలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమలకు పుష్కలంగా నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తున్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సీఎం సూచించారు. ఏపీకి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

### సెప్టెంబరు నాటికి అందుబాటులోకి 175 ఎంఎస్ఎంఈ పార్కులు

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులన్నీ జాతికి గర్వకారణమేనని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్సు, హిందుపూర్ సమీపంలో ఏరో స్పేస్ ప్రాజెక్టులు రావాలని సీఎం నిర్దేశించారు. మూలపేట పోర్టు డిసెంబరులో ప్రారంభించేలా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు.

రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఆధునిక వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను అనుసంధానించాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లేలా రోడ్ రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండాలన్నారు. గత ఏడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపీబీలో అనుమతి పొందిన ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను కూడా పూర్తి చేసి 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి రావాలన్నారు.

వన్ ఫ్యామిలీ- వన్‌ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్దేశించారు.

### 20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు

1.ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ కర్నూలు జిల్లాలో రూ.616 కోట్ల పెట్టుబడి, 130 మందికి ఉద్యోగాలు
2.జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ కర్నూలు జిల్లాలో రూ.1533 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు
3.ఎఫ్ పీఈఎల్ రవ్వేద పవర్ , విజయనగరం జిల్లాలో రూ.480 కోట్ల పెట్టుబడి, 275 మందికి ఉద్యోగాలు
4.వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, కాకినాడ జిల్లాలో రూ.15000 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగాలు
5.ఆరాధ్యా బయోగ్యాస్ , కర్నూలు జిల్లాలో రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు
6.ఉషోదయా బయోగ్యాస్, నెల్లూరు జిల్లా, రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు
7.డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా, విశాఖపట్నం, రూ.58,743 కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు
8.మునోత్ లిథియం బ్యాటరీ లిమిటెడ్, తిరుపతి జిల్లాలో రూ.500 కోట్ల పెట్టుబడి, 240 మందికి ఉద్యోగాలు
9.ఏఐఎల్ డిక్సన్ ఇండియా లిమిటెడ్, కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్ లో, రూ.450 కోట్ల పెట్టుబడి, 7000 మందికి ఉద్యోగాలు
10.రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్, అనకాపల్లి జిల్లా, రూ.85,200 కోట్ల పెట్టుబడి, 1880 మందికి ఉద్యోగాలు
11.ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్, విశాఖ జిల్లా, రూ.31,387 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
12.సీఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్ పీ, తిరుపతి జిల్లాలో రూ.192.02 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు
13.ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తిరుపతి జిల్లా లో రూ.150 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు
14.సన్ రైజ్ హోటల్స్ ఇండియా లిమిటెడ్, కాకినాడ జిల్లాలో రూ.54 కోట్ల పెట్టుబడి, 75 మందికి ఉద్యోగాలు
15.జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్ పీ, కృష్ణా జిల్లాలో రూ.63.79 కోట్ల పెట్టుబడి, 100 మందికి ఉద్యోగాలు
16.పావులూరి హోటల్స్, తిరుపతి జిల్లా, రూ.58.74 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు
17.అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.7799.96 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
18.అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్, విశాఖపట్నం జిల్లా రూ.1600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగాలు
19.కోరమాండల్ ఇంటర్నేషనల్, శ్రీకాకుళం జిల్లా, మూలపేట, రూ.2125 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు
20.హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్, చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.880 కోట్ల పెట్టుబడి, 447 మందికి ఉద్యోగాలు
21.ఎస్ట్రేలా లాజిస్టిక్స్ , విశాఖపట్నం జిల్లాలో రూ.90 కోట్లు,100 మందికి ఉద్యోగాలు
22.గణేష్ సాయి మౌనిష స్టీల్ వైర్స్, విజయనగరం జిల్లాలో రూ.66 కోట్ల పెట్టుబడి, 120 మందికి ఉద్యోగాలు
23.వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ , నెల్లూరు జిల్లా, మనుబోలు, రూ.500 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు (ప్రైవేట్ పార్క్)
24.జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.300 కోట్లు పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు
25.ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్, నెల్లూరు జిల్లాలో, రూ.330.71 కోట్ల పెట్టుబడి, 1110 మందికి ఉద్యోగాలు

## గోదావరి జలాల వినియోగంపై

# కీలక ఆదేశాలు

### - ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క



హైదరాబాద్,: మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు అప్పగించే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా ఈ నిర్ణయం ఉందని కొనియాడారు. మహిళా సంఘాల సాధికారతకు సీఎం నిర్ణయం మరో ముందడుగని ప్రశంసించారు. ఈరోజు (గురువారం) సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. మహిళా సంఘాలకు మిల్లింగ్‌లో అవకాశం కల్పించినందుకు మహిళల తరుపున మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ కేంద్రాల ఏర్పాటుతో మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. మిల్లింగ్, ధాన్యం నిల్వ రంగాల్లో మహిళా సంఘాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సీఎం నిర్ణయంతో గ్రామీణ మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు మరింత పెరుగుతాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపితే సహకరిస్తాం

ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు చెందిన బకాయిని వసూలు చేయాల్సిందేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

### మిల్లర్లపై కన్నెర్రజేసిన సీఎం రేవంత్ రెడ్డి

మిల్లర్ల బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్నెర్రజేశారు. ధాన్యం సేకరించి బకాయిలు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. బకాయి దారులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అలాగే మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

#### మొండి బకాయిదారులకు ప్రత్యామ్నాయంగా మహిళా సంఘాలు

మిల్లర్ల బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాల రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సీఎం సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

#### ప్రతీ సీజన్‌లో ధాన్యం నిల్వలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్ట కింద చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్జి) ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలియజేశారు.

వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వీబీ జీ రామ్ జీ లో ఫ్లాట్‌ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోపపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ నందు సత్తా చాటిన లయోలా స్కూల్ విద్యార్థులు

**తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని గల పెండేకల్ ఆర్.ఎస్ లోని గల లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ సెలెక్షన్స్‌లో ఉత్సాహంగా పాల్గొని తమ సత్తా చాటారని లయోలా పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల,ఏకాగ్రతతో పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన లయోలా పాఠశాల విద్యార్థులు ఐదుగురు స్టేట్ లెవల్ రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక అఅయ్యారని ఆయన తెలియజేశారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు.

ఈ సందర్భంగా స్టేట్ లెవల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ దివ్య అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కృషి ఉంటే విజయం తప్పక సొంతమవుతుందని,మా విద్యార్థుల ప్రతిభ మాకు ఎంతో గర్వకారణమని కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి తెలియజేశారు.

# జర్నలిస్టులపై కేసులు, ఎంతవరకు సమంజసం.?

**- అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే టార్గెట్ చేయడం దారుణం**

**- జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం: అధ్యక్షులు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు**

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణలో జర్నలిస్టులపై పూర్తిస్థాయిలో విచారణ జరపకుండానే కేసులు నమోదు చేయడం బాధాకరమని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అవినీతి--అక్రమాలను ప్రశ్నించడం జర్నలిస్టుల బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్న వారినే కేసులతో భయపెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల రాష్ట్రంలో పలు సందర్భాల్లో జర్నలిస్టులపై కేసులు నమోదవుతున్న నేపథ్యంలో తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారు స్వేచ్ఛగా తిరుగుతుంటే, వారిని ప్రశ్నించిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

### ప్రశ్నిస్తే కేసులేనా.?

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి కొంతమంది జర్నలిస్టులు చేస్తున్న ప్రయత్నాలకు రాజకీయ నాయకులు, అధికారులు అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా పోలీసు ఉన్నతాధికారులు తీసుకుంటున్న కఠిన వైఖరి స్ఫూర్తిగా నిలుస్తోందని, అదే తరహాలో అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టులకు కూడా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.
జర్నలిస్టులను టార్గెట్ చేసి కేసులు నమోదు చేయడం ద్వారా వారి గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు సమగ్రంగా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

### జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి

తెలంగాణలో త్వరలోనే జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలన్న డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి జర్నలిస్టులను ఏకం చేస్తామని ఆనంచిన్ని వెంకటేశ్వరరావు




తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులకు ఎదురయ్యే బెదిరింపులు, దాడులు, అక్రమ కేసులు, వేధింపుల నుంచి రక్షణ కల్పించే పటిష్ఠమైన చట్టం అవసరమన్నారు.

### అక్రిడిటేషన్లలో అన్యాయం..

అక్రిడిటేషన్ కార్డుల విషయంలోనూ నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందన్న ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని చెప్పారు. అనేక మంది రిపోర్టర్లు ఫోన్ చేసి తమ సమస్యలను వివరిస్తున్నారని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.
రాష్ట్రంలో జర్నలిస్టులకు కనీస సౌకర్యాలు, సేవలు కూడా అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులంటే కొంతమంది అధికారులకు ఎందుకంత భయమో అర్థం కావడం లేదన్నారు.

### అక్రమాలకు అండ, నిజమైన జర్నలిస్టులకు చెడ్డపేరు

జర్నలిస్టుల ముసుగులో కొంతమంది అక్రమార్కులకు అండగా ఉంటున్నారని దానితోపాటు సెటిల్మెంట్లకు పాల్పడటం అత్యంత బాధాకరమని వెంకటేశ్వరరావు మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తుల వల్ల నిజాయితీగా పనిచేస్తున్న వేలాది మంది జర్నలిస్టులకు చెడ్డపేరు వస్తోందన్నారు. జర్నలిజం పేరును అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడేవారిని మీడియా సంఘాలు కూడా ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని, నిజమైన జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.
ఈ సమావేశంలో తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, ట్రెజరర్ తదితర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


# సంప్రద హాస్పిటల్ ముందు ఆందోళన

**- వైద్యం వికటించి తన కొడుకు మృతి చెందాడని తండ్రి ఆందోళన**

**- ఆగ్రహం వ్యక్తం చేసిన మృతిని బంధువులు : ఆస్పత్రి ముందు ఆందోళన**

**- మరో రూ. 5 లక్షలు బిల్లులు చెల్లించాలి అంటూ ఆస్పత్రి యాజమాన్యం డిమాండ్**




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ లోని సంప్రద హాస్పిటల్ ముందు వైద్యం వికటించి మృతి చెందిన యువకుడి బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. వివాదాలకు కేరాఫ్ గా మారిన సంప్రద హాస్పిటల్ మరోసారి వివాదానికి తెరలేపింది. రోడ్డు ప్రమాదంలో గాయప పడి తలకు గాయాలై సంప్రద హాస్పిటల్ కు వస్తే సదుపాయాలు లేకపోయినప్పటికీ తాము శస్త్ర చికిత్స చేస్తామంటూ ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యం అందిస్తుండగా వైద్యం వికటించి తన కొడుకు మృతి చెందాడని మృతుని తండ్రితో పాటు బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి ముందు ఆందోళన దిగారు. ఆస్పత్రిలో సౌకర్యాలు లేవని తెలుసుకొని వేరే ఆసుపత్రికి తీసుకెళ్తామంటూ చెప్పినప్పటికీ ఆసుపత్రి వర్గాలు చికిత్స చేసి బాగు చేస్తామంటూ ఆస్పత్రిలో దాదాపు 25 రోజులు ఉంచుకొని చివరకు ప్రాణాలు తీశారు అంటూ ఆరోపిస్తూ బాధితులు ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా రూ. 5 లక్షలు బిల్లు రావాలి అంటూ సంప్రదా ఆసుపత్రి యాజమాన్యం డిమాండ్ చేయడంతో మృతుని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు ఈ ఆసుపత్రిలో చోటుచేసుకున్నాయి.

**వివరాలు ఇలా ఉన్నాయి**



కళాకల్ కు చెందిన చెందిన అజయ్ (23) అనే ఎంబీఏ విద్యార్థి గత నెల 18న రోడ్డు ప్రమాదానికి గురి అయ్యాడు. తలకు బలమైన గాయం కావడంతో మేడ్చల్ లోని సంప్రద హాస్పిటల్ లో చేరి చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే అయిన వైద్య ఖర్చులకు కింద రూ. 20 లక్షల వరకు ఖర్చు గాక ఈరోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే సంప్రద హాస్పిటల్ యాజమాన్యం మాత్రం తమకు ఇంకా రూ. 5 లక్షలు రావాలి అంటూ పట్టు పట్టడంతో మృతుని బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు.

గతంలోనూ చికిత్స పొందిన తండ్రి వైద్య ఖర్చులు చెల్లించలేదని ఆయన కొడుకుని బంధించి వైద్య ఖర్చులు ఇవ్వాలి అంటూ ఈ ఆస్పత్రి పట్టు పట్టింది. చివరకు ఈ వ్యవహారం మీడియాకు తెలియడంతో బంధించిన యువకుడిని వదిలేసిన ఘటన ఈ ఆసుపత్రి లో చోటుచేసుకుంది. ఈ ఘటనను మరువకముందే వైద్యం వికటించడంతోనే తన కొడుకు మృతిచెందగా ఇంకా రూ. 5 లక్షల బిల్లులు చెల్లించాలి అంటూ ఆసుపత్రి యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుంది అని మృతుని తండ్రి సభాపతి శర్మ ఆరోపించారు. చివరకు మేడ్చల్ పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని శాంతింప చేశారు.

# కుల ధ్రువీకరణ పత్రాలపై ఫిర్యాదు..

**- కంబదహాల్‌లో రెవెన్యూ అధికారుల విచారణ - ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ**

**ఆగస్టు 11, సి.బెళగల్:** మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందిన ఫిర్యాదు మేరకు మండల తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశాలతో అధికారులు గ్రామానికి వెళ్లి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కంబదహాల్ గ్రామానికి చెందిన ముక్కిరాల ప్రతాప్ గత జూలై 27న కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఐజఖీ 202607271994 నంబర్‌తో నమోదైన ఈ అర్జీలో అదే గ్రామానికి చెందిన మొండి మల్లికార్జున, మొండి పెద్ద రంగన్న, మొండి చిన్న సుంకన్న, మొండి చిన్న రంగన్న, బోయ మొండి తిమ్మప్ప తదితరుల కుల ధ్రువీకరణ పత్రాలపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదుదారు పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు గతంలో బీసీ వర్గానికి చెందిన మొండి కులానికి సంబంధించిన వారని, ప్రస్తుతం ఎరుకల ఎస్టీ వర్గానికి చెందినవారిగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందినట్లు ఫిర్యాదుదారు ఆరోపించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఫిర్యాదుదారు కోరినట్లు తెలిసింది. గ్రామస్థుల నుంచి వివరాల సేకరణఈ నేపథ్యంలో మండల తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచనల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తరుణ్, గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ మంగళవారం కంబదహాల్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ముందుగా ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తుల నివాస ప్రాంతానికి వెళ్లి చుట్టుపక్కల నివసిస్తున్న వ్యక్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పలువురు వ్యక్తులతో మాట్లాడి సంబంధిత కుటుంబాల సామాజిక నేపథ్యం, కులానికి సంబంధించిన వివరాలు, గతంలో ఉన్న సమాచారం తదితర అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. గ్రామంలో పలువురిని విడివిడిగా విచారించి వారి నుంచి వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించడంతో పాటు, గ్రామస్థుల నుంచి వచ్చిన వివరాలను కూడా నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదికఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తరుణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదు మేరకు కంబదహాల్ గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలోని సంబంధిత వ్యక్తులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించామని చెప్పారు. విచారణలో సేకరించిన పూర్తి వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల అంశంపై పూర్తి స్థాయిలో పరిశీలన అనంతరం వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలిపారు. విచారణతో




గ్రామంలో చర్చకుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టడంతో కంబదహాల్‌లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అధికారులు గ్రామస్థులను విచారించి వివరాలు నమోదు చేయడంతో ఫిర్యాదుపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు ప్రస్తుతం విచారణలో ఉన్న అంశాలేనని, సంబంధిత అధికారుల సమగ్ర పరిశీలన అనంతరం మాత్రమే వాస్తవాలు నిర్ధారణ అవుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ క్షేత్రస్థాయి విచారణలో గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, రెవెన్యూ అసిస్టెంట్ హనుమంతు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మేం 'టీ-హబ్' కడితే..
# రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

ఉద్యోగులతో కూడిన స్కామ్, అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

# కర్ణాటకలో మంత్రులకు శాఖలు కేటాయింపు

శివరాజ్ తంగడగి- వెనుకబడిన తరగతుల సంక్షేమం; కన్నడ సంస్కృతి, టీ రఘుమూర్తి - ఎస్టీ సంక్షేమం, డాక్టర్ అజయ్ సింగ్ - చిన్నతరహా నీటిపారుదల; సైన్స్ అండ్ టెక్నాలజీ, చెలువరాయస్వామి - భారీ మధ్యతరహా నీటిపారుదల శాఖ, మధు బంగారప్ప - ప్రాథమిక, మాధ్యమిక విద్య, బసవరాజ రాయ రెడ్డి - ఉన్నత విద్య, శివలింగే గౌడ - ఎక్సైజ్, పుట్టరంగ శెట్టి- పశు సంవర్ధక, సెరికల్చర్, విజయానంద కాశప్పనవర్ - చిన్న తరహా పరిశ్రమలు; పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, సంతోష్ లాడ్ - లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్, కె ఎస్ బసవంతప్ప - ముజ్రాయ్; మత్స్య సంపద; ఓడరేవులు, అంతర్గత జలాలు, ఎస్ ఎస్ మల్లికార్జున్ - మైన్స్ అండ్ జియాలజీ; హార్టికల్చర్, రిజ్వాన్ అర్షద్ - ఆహార పౌర సరఫరాలు; వినియోగదారుల వ్యవహారాలు, నరేంద్ర స్వామి- వ్యవసాయం, హెచ్ సి బాలకృష్ణ- పురపాలక పరిపాలన, బి నాగేంద్ర- ప్రణాళిక మరియు గణాంకాలు.

### వర్షాకాల సమావేశాల తర్వాత క్యాబినెట్‌లోకి మహిళలు

ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చల అనంతరం మంత్రులకు శాఖల కేటాయింపులు జరిగాయి. సోమవారం బెంగళూరుకు తిరిగి వచ్చిన అనంతరం శివకుమార్ మాట్లాడుతూ వర్షాకాల సమావేశాల తర్వాత ఒక మహిళను మంత్రివర్గంలో చేర్చుకుంటామని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణను ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకోని సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అసంతృప్తితో ఉన్న కొంతమంది నాయకులకు చోటు కల్పించేందుకు పార్టీ మార్పులను పరిశీలిస్తోంది, కానీ కొత్తగా చేరిన మంత్రులను తొలగిస్తే మరో విడత అసమ్మతికి దారితీయవచ్చని వర్గాలు తెలిపాయి. జూన్ 3న శివకుమార్, 13 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత మంత్రివర్గాన్ని విస్తరించడానికి కాంగ్రెస్‌కు దాదాపు రెండు నెలల సమయం పట్టింది. ఆ తర్వాత 19 మంది మంత్రులను చేర్చుకోవడంతో పోర్ట్‌ఫోలియోల విషయంలో తీవ్ర డిమాండ్లను పరిష్కరించడానికి నాయకత్వంపై ఒత్తిడి పెరిగింది. ఇంతకుముందు ఆహార, పౌర సరఫరాల శాఖను నిర్వహిస్తున్న మునియప్ప, సాంఘిక సంక్షేమ శాఖను కోరుకుంటున్నారు. ఈ కేటాయింపుతో ఆయన లాబీయింగ్ చేస్తున్న పోర్ట్‌ఫోలియోనే పొందారు. క్యాబినెట్ మహిళలకు అధిక ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ ఊపందుకుంది. లక్ష్మీ హెబ్బాల్కర్, అన్నపూర్ణ ఇ తుకారాం, కనీజ్ ఫాతిమాల పేర్లను పరిశీలించినప్పటికీ, ఈ అంశం ప్రస్తుతానికి వాయిదా పడింది.

## సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో అరటి మొక్కలు నాటిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్** కరీంనగర్ నగరంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ఆవరణలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అరటి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని, చిన్నప్పటి నుంచే ప్రకృతిపట్ల ప్రేమ, చెట్ల పట్ల బాధ్యతాభావం అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు విద్యతో పాటు సామాజిక బాధ్యతలను పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని ఆయన అన్నారు.
పాఠశాలకు 200 అరటి మొక్కలను రంగు సంపత్ ఇవ్వడం జరిగింది. అనంతరం విద్యార్థులకు సువర్ణప్రాశన చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న విద్యా, ఆరోగ్య, పర్యావరణ కార్యక్రమాలను మేయర్ అభినందించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, దేవసాని సరస్వతీ సత్యనారాయణ , పాఠశాల ప్రధానాచార్యులు మోర రణదీర్ , ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 41వ వార్డులో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**బద్వేలు** కడప జిల్లా ప్రొద్దుటూరు 41వ వార్డు ప్రాంతానికి చెందిన వెంకట సుబ్బయ్య తన కుటుంబ సభ్యులు ఇతరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయజ్యోతి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేదలు, సామాన్య ప్రజల పార్టీ అని, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా, వైఎస్ షర్మిలా రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇర్ఫాన్ బాషాను సంప్రదించాలని, ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత వర్గానికి చెందిన వారు సంక్షేమ పథకాలు అందడం లేదని విన్నవించగా, సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారానికి ఇర్ఫాన్ బాషా కృషి చేస్తారని విజయజ్యోతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొసంగి సుబ్బారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అబ్బాస్ , బద్వేల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లురు భాష, మైనారిటీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ గౌస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలే లక్ష్యం

స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్‌హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా, నటుడు డా. మాదాల రవి గౌరవ అతిథిగా, ప్రముఖ నటుడు సాయికుమార్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ వెల్‌నెస్ ఫ్యామిలీ కార్డు ప్రారంభించారు. కుటుంబ ఆరోగ్య సంరక్షణను సులభతరం చేయడంతో పాటు, నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే దీని లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలు కీలకమని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. సమయానికి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని నటుడు సాయికుమార్ పేర్కొన్నారు. స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. భరత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక, విశ్వసనీయమైన డయాగ్నస్టిక్ సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. నాలుగేళ్ల ప్రయాణంలో మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య రంగ నిపుణులు, సిబ్బంది, అతిథులు పాల్గొన్నారు.

## రాక్ బాల్ క్రీడాకారుడు గోపాల్ యాదవ్ ను అభినందించిన కల్వకుంట్ల కవిత



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ఇటీవల జరిగిన దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు విజయానికి విశేషంగా కృషి చేసి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ఇటబోయిన గోపాల్ యాదవ్ బుధవారం గురువారం తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత గోపాల్ యాదవ్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం కవిత మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో భాగస్వామి కావడం గర్వకారణమని అన్నారు. తెలంగాణ యువత క్రీడల్లో రాణిస్తూ దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. గోపాల్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సేన మహిళా అధ్యక్షురాలు వనజ నియోజకవర్గం పార్టీ ఇంచార్జ్ గండికోట కుమార్, గ్రామస్తులు శ్రీపాల్ యాదవ్, కిరణ్, సాయిబాబు, చిత్తారి తదితరులు పాల్గొన్నారు.

## మండలి డిప్యూటీ చైర్మన్‌గా మాధవరావు

### వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థిగా ప్రకటించిన: జగన్



### ఎమ్మెల్సీలంతా మద్దతివ్వాలి.. ఎన్నిక సజావుగా జరిగేలా సమన్వయం

### ఖాళీని ఎక్కువకాలం కొనసాగించొద్దు: జగన్

తాడేపల్లి(ప్రశ్న న్యూస్) శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును పార్టీ తరఫున అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీగా ఉన్న నేపథ్యంలో దాని భర్తీ ప్రక్రియపై సమావేశంలో జగన్ చర్చించారు. రాజ్యాంగపరంగా ఈ పదవికి కీలక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. శాసనసభలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఉన్నట్టే శాసనమండలిలో చైర్మన్, డిప్యూటీ చైర్మన్ ఉంటారని గుర్తుచేశారు.

#### ఖాళీని ఎక్కువకాలం ఉంచొద్దు

డిప్యూటీ చైర్మన్ పదవి ఖాళీ అయినప్పుడు దానిని ఎక్కువకాలం కొనసాగించకుండా భర్తీ చేయాల్సిన అవసరం ఉందని జగన్ అన్నారు. పార్టీ తరఫున తూమాటి మాధవరావును అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. మాధవరావుకు పార్టీ ఎమ్మెల్సీలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సూచించారు. ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగేలా ఎమ్మెల్సీలంతా సమన్వయంతో వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.

#### సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపైనా జగన్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచనలు చేశారు. ప్రజా సమస్యలను సభలో సమర్థంగా ప్రస్తావించాలని, అందుకు అవసరమైన సమాచారంతో పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. మండలిలో పార్టీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. మాధవరావు ఎన్నికకు పార్టీ ఎమ్మెల్సీలంతా సమష్టిగా పనిచేసి ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని జగన్ కోరారు.

## ఉక్కుపాదం.. అసాంఘిక శక్తులకు చెక్

### పేకాట, గంజాయి, వ్యభిచారంపై కొరడా



### నేర నియంత్రణలో వకుల్ జిందాల్ మార్కు

### ప్రత్యేక నిఘాతో కదలికలకు అడ్డుకట్ట

### .. క్షేత్రస్థాయిలో పోలీసులకు దిశానిర్దేశం

గుంటూరు(ప్రశ్న న్యూస్) జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. నేరాలకు ముందే అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. పేకాట శిబిరాలు, గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, వ్యభిచార కార్యకలాపాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలకు ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిలో పోలీసుల నిఘాపై ఆందోళన మొదలైంది.

#### నేరాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో నేరాల నియంత్రణకు ఎస్పీ వకుల్ జిందాల్ పలు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల తీరును విశ్లేషిస్తూ.. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ నిఘా పెంచేలా అధికారులకు సూచిస్తున్నారు. స్థానికంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తుల కదలికలు, గతంలో నేరాలకు పాల్పడిన వారి వ్యవహారశైలి

## ఇవి రోడ్లు కావు..ప్రయాణికులకు యమాషాపాలు

- గుంతలమయంగా మారిన కేఎల్‌ఆర్ శివాలయం,రోడ్డు
- కే ఎల్ ఆర్ లో శివాజీ స్టాచ్ చుట్టుపక్కల రైడ్లు
- బాలాజీనగర్ కోర్టు రోడ్డు
- వర్షం పడితే గుంతల్లో నీరు, ప్రయాణికులకు ప్రాణసంకటం
- స్కూల్ బస్సులు, సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు, పాదచారులకు తప్పని తిప్పలు










**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )**మేడ్చల్‌లోని పలు ప్రధాన రహదారులు రోడ్లను తలపించకుండా గుంతలమయంగా మారి ప్రజలకు నరకయాతనను మిగుల్చుతున్నాయి. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ఏది రోడ్డో.. ఏది గుంతో తెలియని పరిస్థితి నెలకొంది.

#### కేఎల్‌ఆర్ శివాలయం రోడ్డేనా.. గుంతల బాటన?

కేఎల్‌ఆర్ శివాలయం వైపు వెళ్లే రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

#### శివాజీ స్టాచ్ రోడ్డు దుస్థితి

శివాజీ స్టాచ్ పరిసర రహదారి కూడా అధ్వానంగా మారింది. వర్షపు నీరు గుంతల్లో నిలిచిపోవడంతో రహదారి మొత్తం ప్రమాదకరంగా మారుతోంది. రాత్రివేళ ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### బాలాజీనగర్--కోర్టు రహదారి.. నిత్యం

అవస్థలుబాలాజీనగర్ నుంచి కోర్టు వైపు వెళ్లే రహదారిలోనూ గుంతలు ప్రయాణికులకు శాపంగా మారాయి. వాహనదారులు నెమ్మదిగా వెళ్లినా గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోయే పరిస్థితి కనిపిస్తోంది.

#### స్కూల్ బస్సులకూ తప్పని ఇబ్బందులు

ఈ రహదారుల మీదుగా స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతల కారణంగా బస్సులు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులకు కూడా రోడ్ల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.

#### పాదచారుల పరిస్థితి మరింత

దారుణంకాలినడకన వెళ్లే ప్రజలకు గుంతల్లో నిలిచిన నీరు మరో సమస్యగా మారింది. వాహనాలు వెళ్లే సమయంలో నీరు చిమ్మడంతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

#### మరమ్మతుల కోసం ప్రజల ఎదురుచూపులు

ప్రధాన రహదారుల పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా నాణ్యమైన రోడ్డు పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

#### రోడ్లపై ప్రయాణమా.. గుంతల మధ్య ప్రయాణమా.?

ప్రజల నుంచి పన్నులు, వివిధ రకాల రుసుములు వసూలు చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం కనీస మౌలిక వసతుల విషయంలోనైనా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా రహదారుల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

### - పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్ల పరిశీలన - ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు.

### - ట్రాఫిక్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి



గుంటూరు(ప్రశ్న న్యూస్) రాజధాని పెరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. బుధవారం డీఐజీ రాజకుమారి, జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పెరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.ద

#### నేడు ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్

ఈ నెల 13న నిర్వహించనున్న ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్‌కు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. కవాతు నిర్వహణ, వివిధ బృందాల కదలికలు, వేదిక, అతిథుల రాకపోకలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అసలు వేడుకల రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రిహార్సల్స్‌ను సమర్థంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

#### ప్రముఖుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ఇతర ప్రముఖులు కూర్చునే ప్రదేశాలను డీఐజీ, కలెక్టర్ పరిశీలించారు. వేదిక వద్ద భద్రత, ప్రవేశం, నిష్క్రమణ మార్గాలపై అధికారులతో చర్చించారు. అతిథులు, ప్రజలు కార్యక్రమానికి చేరుకునే మార్గాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

#### ట్రాఫిక్‌కు ప్రత్యేక ప్రణాళిక

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, అధికారులు, అతిథులు హాజరయ్యే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు ముందస్తు ట్రాఫిక్ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు.. సమన్వయంతో నిర్వహణ.. ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

## ఇందిరానగర్ లో కావలి సతీష్ తో కలిసి ఫలహార బండి ఊరేగింపులో పాల్గొన్న కార్తీక్ రెడ్డి, నాగేష్ ముదిరాజ్



శంషాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే బోనాల వేడుకలు తెలంగాణ సాంస్కృతికి ప్రతిబింబం అని రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. కొత్వాల్ గూడ బి ఆర్ ఎస్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షుడు కావలి సతీష్ ఆధ్వర్యంలో ఊట్పల్లి ఇందిరానగర్ లో మంగళవారం రాత్రి జరిగిన పలహార బండి ఊరేగింపులో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, ముషీరాబాద్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు నాగేష్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బోనాల పండుగకు ప్రత్యేక శోభను తీసుకువచ్చారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను గౌరవించి వాటిని ఆచరిస్తున్న ప్రజలను గౌరవించి పండగలకు పెద్దపీట వేసిందని తెలిపారు. బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించిన కావలి సతీష్ తదితరులను కార్తీక్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కావలి సతీష్ కార్తీక్ రెడ్డి, నాగేష్ ముదిరాజ్ లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్వాల్ కూడా డివిజన్ అధ్యక్షుడు కోనమూల శ్రీనివాస్, శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు కోలను ప్రదీప్ రెడ్డి, సీనియర్ నాయకులు బైరమోని మల్లేష్ ముదిరాజ్, కొత్తింటి శ్రీనివాస్, బోడంపాటి మహేష్, కావలి రాము, బండారి మల్లేష్, కే వెంకటేష్, కే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రామనాథ్ ముదిరాజ్ పుట్టినరోజు వేడుకలు



శంషాబాద్(ప్రశ్న న్యూస్) శంషాబాద్ డివిజన్లోని గాన్సీమియా గూడ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గుగ్గిళ్ళ రామనాథ ముదిరాజ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామనాథ్ ముదిరాజ్ ఆలయ కమిటీ చైర్మన్ అయిన తర్వాత ఆలయ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నారని పలువురు ప్రశంసించారు. ఆయన చేత కేకు కట్ చేయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, పెద్ద షాపూర్ సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్ మాజీ సర్పంచ్ దేవిక జగన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పూసలపాటి యాదయ్య గౌడ్, పెద్ద షాపుర్ సర్పంచ్ నందు ముదిరాజ్, రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ జూనియర్ అసిస్టెంట్ మహిపాల్ యాదవ్, ఆలయ పూజారులు పగడాల శ్రీశైలం , మడపతి మల్లికార్జున్ , నాగం గిరి ముదిరాజ్ , జిల్లా శ్రీనివాస్ ముదిరాజ్ , దేవులపల్లి నరసింహ గౌడ్ , సాయి, నీరటి నరేష్ ముదిరాజ్, జిల్లా కిట్టు ముదిరాజ్, జిల్లా ఆనంద్ ముదిరాజ్, యాదయ్య, టి మహేందర్, కే వెంకటేష్ తదితరులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# సమాజసేవకు సార్థకత..

## డా. సుధీర్ కుమార్ సంగెంకు అపూర్వ సత్కారం



ఆదిలాబాద్(ప్రశ్న న్యూస్) నిరంతర ప్రజా సంక్షేమం, నిస్వార్థ సమాజ సేవయే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ సుధీర్ కుమార్ సంగెంకు ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ వేదికగా అభినందనల నీరాజనం పలికారు. ఇటీవల సమాజ సేవలో ఆయన కనబరిచిన అసమాన ప్రతిభకు గుర్తింపుగా దక్షిణాఫ్రికాలోని ప్రఖ్యాత 'వెల్లింగ్టన్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిన సంగతి విదితమే. ఈ అంతర్జాతీయ గౌరవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

### ఘనంగా సత్కరించిన బార్ అసోసియేషన్:

ఈ వేడుకలో ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ నగేష్, ఉపాధ్యక్షుడు శ్రీ చందు సింగ్, కార్యదర్శి శ్రీ కేమ శ్రీకాంత్ లతో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు కొర్రి రమణయ్య, భావన సింగ్, ముజాహిద్ ఉస్సేన్, సంగీత తదితరులు డాక్టర్ సుధీర్ కుమార్ సంగెంను శాలువాతో కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

### సేవా నిరతికి నిదర్శనం - సీనియర్ న్యాయవాదుల ప్రశంసలు:

ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు శ్రీ అమరేందర్ రెడ్డి, గంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. సమాజంలోని వెనుకబడిన, పేద వర్గాలకు అండగా నిలుస్తూ డాక్టర్ సుధీర్ కుమార్ చేస్తున్న సేవలు ఎందరికో ఆదర్శనీయమని కొనియాడారు. ఆయన సేవలకు అంతర్జాతీయ స్థాయిలో దక్కిన ఈ గౌరవం ఆదిలాబాద్ జిల్లాకే గర్వకారణమని కొనియాడారు.

### బాధ్యత మరింత పెరిగింది: డాక్టర్ సుధీర్ కుమార్ సంగెం

సన్మాన గ్రహీత డాక్టర్ సుధీర్ కుమార్ సంగెం మాట్లాడుతూ "నా సేవలను గుర్తించి వెల్లింగ్టన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇవ్వడం, అలాగే నా సొంత నేలపై న్యాయవాదుల సంఘం నన్ను ఇంత ఆప్యాయంగా సన్మానించడం నా జీవితంలో మర్చిపోలేని గౌరవం. ఈ అభినందన నాపై బాధ్యతను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతాను" అని భావోద్వేగంగా తెలిపారు. సేవారంగంలో ఉన్నవారికి మరింత ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని నింపేలా సాగిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేషంగా ఆకట్టుకుంది.

# ఏజెన్సీని ఎడారిగా మారుస్తున్నారా

## - ఐటీడీఏ తరలింపుపై బీజేపీ ఆగ్రహం

**ఐటీడీఏను ములుగుకు తరలిస్తే ఏటూరునాగారం వెనుకబడుతుంది: జాడి రామరాజు**

**దేవదుల నీళ్లు, ఐటీడీఏ నిధులు మైదానానికే : స్థానిక నేతల మౌనంపై ప్రశ్నలు.**



ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్) ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి వెన్నెముకగా ఉన్న ఐటీడీఏ కార్యాలయాన్ని మైదాన ప్రాంతమైన ములుగుకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీపీ జాడి రామరాజు ఆరోపించారు. దీనివల్ల ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాలు 80 ఏళ్లు వెనుకబడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. 35 ఏళ్ల క్రితం అప్పటి రవాణాశాఖ మంత్రి కాకులమర్రి విజయరామరావు ఏటూరునాగారం బస్సు డిపోను మైదాన ప్రాంతానికి తరలించారని గుర్తు చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు, నిరాహార దీక్షల అనంతరం బస్సు డిపో, రెవిన్యూ డివిజన్‌ను తిరిగి సాధించామని తెలిపారు.

### నీరు, నిధులు రెండూ మైదానానికేనా..

దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి ఏజెన్సీ రైతులకు సాగు, తాగునీరు ఇవ్వకుండా మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై స్థానిక నాయకులు మంత్రికి పాలాభిషేకం చేశారే తప్ప, ఈ ప్రాంతానికి నీరందాలని డిమాండ్ చేయలేదని విమర్శించారు. ఐటీడీఏ నిధుల వల్లనే ఈ నాలుగు మండలాల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఐటీడీఏ ఉంటే 1/70 యాక్ట్ వల్ల అభివృద్ధి ఆగుతుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, దానికి రెండింటికీ సంబంధం లేదని స్పష్టం చేశారు.

### ఆదివాసీ సంఘాలు స్పందించాలి..

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఏజెన్సీని ఎడారిగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పార్టీ ఆదేశాల మేరకే పని చేస్తున్నారే తప్ప ప్రజాసేవ చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా ఆదివాసీ, దళిత, బహుజన, మైనార్టీ సంఘాలు, మేధావులు, పత్రికా మిత్రులు ఏకమై ఐటీడీఏను కాపాడుకోవాలని జాడి రామరాజు పిలుపునిచ్చారు.

# బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎంపికైన ఉదయ్ నాగరాజుకు ఘన సన్మానం




గజ్వేల్ (ప్రశ్న న్యూస్) బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎంపికైన శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజుకు సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఘన పౌర సన్మానం నిర్వహించారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ నాగరాజును శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ బిడ్డ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకోవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఉదయ్ నాగరాజు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# శ్రీగిరి కొండపైన శ్రావణమాసోత్సవాలు ప్రారంభం

**- భక్తుల పై ప్రత్యక దృష్టి ఈవో శ్రీనివాస్**

**-మొత్తం 19 రోజులపాటు గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, అమ్మవారి కుంకుమార్చనలు పూర్తిగా నిలుపుదల**

**- మూడుశుక్రవారాలలో ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతములు**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ఆగష్టు 13 నుంచి సెప్టెంబరు 12 వరకు శ్రావణమాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లుగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మాసోత్సవాలలో అధికసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచేకాకుండా కర్ణాటక మరియు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు శ్రావణంలో ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు వసతి, మంచినీటిసరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, సాధారణ రోజులలో శ్రీస్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు,అన్నప్రసాదాల వితరణ, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగు మొదలైన వాటికి సంబంధించి పలు ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం శ్రావణశనివారాలు, శ్రావణ ఆదివారాలు,శ్రావణసోమవారాలు, వరలక్ష్మీవ్రతం, శ్రావణపౌర్ణమి మొదలైన రోజులలో ( మొత్తం 19 రోజులపాటు) గర్భాలయ అభిషేకాలు మరియు సామూహిక అభిషేకాలు, అమ్మవారి కుంకుమార్చనలు పూర్తిగా నిలుపుదల చేయబడ్డాయన్నారు. అదేవిధంగా ఉదయాస్తమానసేవ, ప్రాత:కాల సేవ, ప్రదోషకాలసేవ పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ రోజులలో రాత్రివేళలో మాత్రమే పరిమితంగా స్వామివారి స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతుందని ఆగష్టు 18, సెప్టెంబరు 1 సెప్టెంబరు 8వ తేదీలలో ( మంగళవారాలలో) ఉదయం వేళ గర్భాలయ అభిషేకాలు నిలుపుదల చేయబడ్డాయన్నారు. శ్రావణమాసంలోని మిగతా సాధారణ రోజులలో గర్భాలయ ఆర్జిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, కుంకుమార్చనలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే ప్రతీరోజు వేకువజామున గం.3.00లకే ఆలయద్వారాలు తెరచి మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ,ప్రాత:కాలపూజలు జరిపించబడుతాయన్నారు. ఉభయదేవాలయాలలో గం.4.30 నుంచి మహామంగళహారతులు ప్రారంభించబడుతాయన్నారు. మహామంగళహారతుల ప్రారంభం నుంచే అనగా గం.4.30లకే భక్తులను దర్శనాలకు అనుమతించడం జరగుతుందన్నారు. సాయంత్రం గం. 4.00ల వరకు ఈ సర్వదర్శనం కొనసాగించబడుతుందున్నారు. తిరిగి సాయంకాలం గం.4.00 నుంచి ఆలయశుద్ధి కార్యక్రమం నిర్వహించి మంగళ వాయిద్యాలు,ప్రదోషకాలపూజలు, సుసాంధ్యం తరువాత గం.5.30ల నుంచి మహామంగళహారతులు ప్రారంభించబడుతాయన్నారు. మహామంగళహారతుల ప్రారంభం నుంచే అనగా సాయంకాలం గం.5.30ల నుంచే దర్శనాలు కొనసాగుతాయన్నారు.

### ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణమాసంలో భక్తుల సౌకర్యార్థమై మూడు పర్యాయములు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిపించబడుతాయన్నారు. ధర్మప్రచారంలో భాగంగా శ్రావణమాసంలో అఖండశివభజనలను నిర్వహిస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు. దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను భక్తులు వినియోగించుకోవాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి వారు కోరారు.

# జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డ రైతు బజార్‌లో అవగాహన కార్యక్రమం

**"ప్లాస్టిక్ వద్దు - గుడ్డ సంచి ముద్దు" అనే నినాదం"**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )హైదరాబాద్ ఎర్రగడ్డ మోడల్ రైతు బజార్‌లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పర్యావరణవేత్త లయన్ అన్యం కోటిరెడ్డి మాట్లాడుతూ, యువత సమతుల్య జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, ప్రకృతిని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూరగాయల కొనుగోలు కోసం రైతు బజార్‌కు వచ్చిన వినియోగదారులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ప్లాస్టిక్ భూమి కాలుష్యానికి, జీవవైవిధ్య నాశనానికి ప్రధాన కారణమవుతోందని తెలిపారు. అలాగే కల్తీ ఆహార పదార్థాలను గుర్తించే విధానం, వాటి వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్లతో వచ్చిన కొంతమంది వినియోగదారులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించి, ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. "ప్లాస్టిక్ వద్దు - గుడ్డ సంచి ముద్దు" అనే నినాదంతో వినియోగదారుల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ సూపర్వైజర్లు ఆంజనేయులు, వి. సుధాకర్, రైతులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోల్ రష్ లో మంటలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ జిల్లా తూముకుంట పరిధిలోని కూల్ రష్ అగ్ని ప్రమాదానికి గురైంది. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. దీనివల్ల కూల్ రష్ గోదాంలో



మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక కేంద్రాలు చేరుకొని మంటలను ఆపారు. దాదాపు ఏడు అగ్నిమాపక కేంద్రాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎంత ఆస్తి నష్టం జరిగిందో తెలియాల్సి ఉంది. కూల్ రష్ గోదాం చుట్టుపక్కల ఇతర గోధములు ఉండడం వల్ల ఎగిసి పడే మంటలు వాటికి అంటుకుంటాయని స్థానికులు ఆందోళన చెందారు. కొన్ని గోదాము యజమానులు ముందస్తుగా గోదాంకు వాటర్ జల్లుతూ కనిపించారు. కూల్ రష్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ పెంచుకున్నారు.

# గణేష్ పల్లి లో సీసీ కెమెరాలు ప్రారంభం

**- నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి**

**- ఎస్ ఐ యూనస్ అహ్మద్ అలీ**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం గణేశ్ పల్లి ప్రధాన కూడలి వద్ద అంగడికిష్టాపూర్ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మాజీ జెడ్పీటీసీ యెంబరి రాంచంద్రం యాదవ్ ,గణేష్ పల్లి సర్పంచ్ పుట్ట రామరాజు,ఉప సర్పంచ్ పుట్ట నర్సింలుతో కలసి ఎస్ఐ యూనస్ అహ్మద్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,ఒక సిసి కెమరా 100 మందితో సమానమని , ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నిందితుల ను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగప పడతాయన్నారు. ప్రజల రక్షణ సెన్సాఫ్ సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని 24 గంటలు పనిచేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు , వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడలిలో , ఎగ్జిట్ ఎంట్రీ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పనిచేయడం లేదని , గ్రామంలో ఉన్న యువకులు ఏం చేస్తున్నారు అనేది తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. యువకులు గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉంటుందన్నారు. యువకులు ఏదైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో నర్సన్నపేట సర్పంచ్ గిల్క బాలనర్సయ్య, ఉపసర్పంచ్ ఊడెం రాంరెడ్డి, చేబర్తి ఉప సర్పంచ్ బొగ్గుల శ్రీకాంత్,నాయకులు శ్రీరాములు, చీకొటి రవి, నర్సింలు, నరేందర్,నాగరాజు,యాదగిరి, శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# ఖరీఫ్ 2026-27 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై ప్రణాళిక



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి అధ్యక్షతన పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఎండి రియాజ్ ఇతర అధికారులతో ఖరీఫ్ 26-27 కాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా కలెక్టర్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేయాలని ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మేరకు గన్నీల అందుబాటులో ఉంచవలసిందిగా అధికారులకు ఆదేశించారు. రైతులు తమ వడ్లను



తడి, తాలు దుమ్ము లేకుండా శుభ్రపరచి, బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. అలాగే వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని ధాన్యం క్రమపద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు వ్యవసాయ విస్తరణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ట్యాబ్ ఎంట్రీలు ఆలస్యమవడం వల్ల రైతుల చెల్లింపులు ప్రభావితమవుతున్నందున, ప్రతి ఎంట్రీను అదే రోజు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో నిరంతర సమీక్ష నిర్వహించాలని కూడా తెలిపారు. రైతులు తమ ధాన్యం అమ్మిన 48 గంటలలోపే వారి ఖాతాల్లో నేరుగా చెల్లింపులు జమ చేయబడతాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాకు మరియు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# ‘ఆపరేషన్ సఫేద్ సాగర్’ సిరీస్ రివ్యూ!



యథార్థ సంఘటనల ఆధారంగా సినిమాలను .. సిరీస్ లను రూపొందించడంలో బాలీవుడ్ మేకర్స్ ముందుంటారు. ఇక దేశభక్తితో ముడిపడిన వాస్తవ సంఘటనలకు దృశ్య రూపం ఇవ్వడంలోను హిందీ సిరీస్ లు తమ ప్రత్యేకతను చాటుతూ ఉంటాయి. అలా సిద్దార్థ్ హీరోగా రూపొందిన సిరీస్ ‘ఆపరేషన్ సఫేద్ సాగర్’. 1999లో భారత్ – పాకిస్థాన్ మధ్య జరిగిన ‘కార్గిల్ యుద్ధం’ .. వాయుసేనకి చెందిన ‘ది గోల్డెన్ యారోస్’ పోషించిన పాత్ర నేపథ్యంలో రూపొందిన సిరీస్ ఇది. 6 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ‘నెట్ ఫ్లిక్స్’లో ఈ నెల 7వ తేదీ నుంచి వివిధ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ తో శాంతి చర్చలకు భారత్ ప్రయత్నిస్తూ ఉంటుంది. భారత ప్రధాని వాజ్ పేయీ రోడ్డు మార్గం ద్వారా బస్సులో పాక్ వెళ్లడానికి సన్నాహాలు జరుగుతూ ఉంటాయి. అయితే కశ్మీర్ ను దక్కించుకుని తీరాలనే పట్టుదలతో పాక్ ఆర్మీ చీఫ్ ముషారఫ్ ఉంటాడు. కశ్మీర్ ను ఆక్రమించడానికి వ్యూహ రచన చేయడంలో నిమగ్నమై ఉంటాడు. ‘ఎల్ ఓ సి’ నియంత్రణ రేఖ వెంట ఉన్న భారత్ స్థావరాలను ఆక్రమించమని చెప్పి, ఉగ్రవాదుల వేషంలో పాక్ సైనికులను పంపిస్తాడు.

ఒక ఎత్తయిన మంచు పర్వతంపై పాక్ సైనికులు స్థావరాలను ఏర్పాటు చేసుకుంటారు. ఆర్మీ హెలికాప్టర్ లపై కూడా దాడి చేయలేని ఎత్తు నుంచి, భారత సైనికులపై తూటాల వర్షం కురిపిస్తూ ఉంటారు. దాంతో శత్రువులను ఎలా ఎదుర్కోవాలనేది భారత సైన్యానికి అర్థం కాదు. వాయుసేనకి చెందిన ‘ది గోల్డెన్ యారోస్’ బృందాన్ని రంగంలోకి దింపడమే పరిష్కార మార్గంగా తోస్తుంది. వింగ్ కమాండర్ ధనోవా సారథ్యంలో యువ పైలట్ల బృందం రంగంలోకి దిగుతుంది. టోనీ .. అజయ్ అహూజా గైడెన్స్ తో, థాలి .. బాల్డీ .. సాంగ్రి .. నిశి ఫైటర్ జట్లతో బయల్దేరుతారు. పాక్ సైన్యం రాకెట్ లాంఛర్లతో రంగంలోకి దిగుతుంది. జెట్ ఫైటర్ ఇంజన్ ఫెయిల్ అయిన కారణంగా, నిశి ప్రమాదంలో పడతాడు. ఎలాంటి పరిస్థితులలోను అతనిని కాపాడాలనే ప్రయత్నంలో అజయ్ జెట్ ఫైటర్ రాకెట్ లాంఛర్ దెబ్బకి కుప్పకూలుతుంది. పారాచూట్ సాయంతో బయటపడిన అజయ్, పాక్ సైనికులకు దొరికిపోతాడు. అక్కడ అతనికి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అతణ్ణి రక్షించుకోవడానికి భారత్ సైన్యం చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయా? అనేది మిగతా కథ.దేశభక్తి .. పోరాట పటిమ .. సాహసాలు చేయడంలో ఆసక్తి కలిగిన కొందరు యువకులు, ఫైటర్ పైలెట్లు కావాలని కలలు కంటారు. ఎంతో కష్టపడి తమ కలను నిజం చేసుకుంటారు. వాళ్లంతా కలిసి పనిచేసే ఆపరేషన్ గా ఈ కథ తెరపైకి వస్తుంది. కశ్మీర్ ను ఆక్రమించాలనే పాక్ కుట్రను ఈ టీమ్ ఎలా ఎదుర్కొంది? అనే ప్రధానమైన సమస్య చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. ఒక వైపున పాక్ లో ఉన్న రాజకీయ పరిస్థితులు .. ముషారఫ్ తీసుకున్న నిర్ణయాలు .. పాక్ కుట్రల కారణంగా బలైపోయిన భారత జవాన్లు .. ఆవేదనతో నిండిపోయిన వారి కుటుంబాల చుట్టూ ఈ యథార్థ కథను ఆవిష్కరిస్తూ వెళ్లారు. ‘గోల్డెన్ యారోస్’లో పనిచేసే ఫైటర్ పైలెట్ల శిక్షణ ఎలా ఉంటుంది? ఆ సమయంలో వారు ఎదుర్కునే ఒత్తిడి ఎలా ఉంటుంది? ప్రేమ .. పెళ్లి .. ఫ్యామిలీ ఎమోషన్స్ ఎలా ఉంటాయి? అనే అంశాలను టచ్ చేస్తూ దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. మంచుకొండలు .. ఫైటర్ జెట్లు .. శత్రువుల స్థావరాలు .. బాంబింగ్ జరిగే తీరు .. శత్రు దేశానికి ఫైటర్ పైలెట్స్ దొరికిపోతే ఎలా ఉంటుంది? ఒకరి కోసం ఒకరు చేసే త్యాగాలు ఎలా ఉంటాయి? వంటి సన్నివేశాలను సహజత్వానికి చాలా దగ్గరగా ఆవిష్కరించారు. 1999లో జరిగిన సంఘటనలను కళ్లకు కట్టారు. సిద్ధార్థ పాత్రకి సంబంధించిన క్లైమాక్స్ కన్నీళ్లు పెట్టేలా ఉంటుంది.

దేశభక్తి వైపు నుంచి .. ఫ్యామిలీ ఎమోషన్స్ వైపు నుంచి మనసును కదిలించడంలో దర్శకుడు చాలావరకూ సక్సెస్ అయ్యాడని చెప్పాలి. ఈ సిరీస్ కోసం ఆర్టిస్టులను ఎంపిక చేసిన తీరు బాగుంది. ఒరిజినల్ పాత్రలకు చాలా దగ్గరగానే కనిపిస్తారు. అందరూ కూడా సహజత్వానికి చాలా దగ్గరగా తమ పాత్రలను నడిపించారు. దర్శకుడు ‘ఓనీ సేన్’ టేకింగ్ బాగుంది. సత్యజిత్ పాండే ఫొటోగ్రఫీ .. అనురాగ్ నేపథ్య సంగీతం .. మిక్కీశర్మ ఎడిటింగ్ కథ మరింత బలంగా నడపడం కోసం తమ వంతు కృషి చేశాయి. కథకి తగినట్టుగా ఎంచుకున్న లొకేషన్స్ ప్రధానమైన ఆకర్షణగా నిలిచాయని చెప్పచ్చు.

## మాస్ మహారాజా రవితేజ
# ‘ఇరుముడి’ ట్రైలర్ వచ్చేసింది..
### ఆగస్టు 21న గ్రాండ్ రిలీజ్!




మాస్ మహారాజా రవితేజ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘ఇరుముడి’ ట్రైలర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ ఈ ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం సినిమాపై భారీ అంచనాలను పెంచేలా ఉంది. రవితేజను ఇప్పటివరకు ఎన్నడూ చూడని సరికొత్త డిఫరెంట్ వేరియేషన్‌లో ఈ చిత్రంలో చూపించబోతున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఒకవైపు అదిరిపోయే మాస్ యాక్షన్ ఎలిమెంట్స్, మరోవైపు తండ్రీకూతుళ్ల మధ్య ఉండే హృదయానికి హత్తుకునే ఎమోషనల్ బాండింగ్, అలాగే కథకు తగ్గట్టుగా జోడించిన డివైన్ టచ్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్ మరియు టీ-సిరీస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 21న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌కు నాపై క్రష్..
## మెసేజ్‌లు చేస్తుంటాడు: మల్లికా శెరావత్



బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్‌కు తనపై క్రష్ ఉందని, ఆయన తనకు సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా మెసేజ్‌లు కూడా చేస్తుంటారని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న ‘ది ట్రెయిటర్స్ 2’ అనే రియాలిటీ షోలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ షోలో తోటి కంటెస్టెంట్ ఆదిత్య కులశ్రేష్ఠ, “మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా? లేక మీపైనే అందరికీ క్రష్ ఉంటుందా?” అని మల్లికాను ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. “నాపైనే అందరికీ క్రష్ ఉంటుంది. ఇటీవల టామ్ క్రూజ్‌కు కూడా నాపై క్రష్ ఏర్పడింది. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉండుంటే, మేమిద్దరం కలిసి పార్టీ చేసుకున్న వీడియోలను మీకు చూపించేదాన్ని” అని బదులిచ్చారు. టామ్ క్రూజ్ అద్భుతమైన వ్యక్తి అని ఆమె కితాబిచ్చారు. అయితే, ఇవి కేవలం మల్లికా శెరావత్ చేసిన వ్యాఖ్యలు మాత్రమేనని, దీనిపై టామ్ క్రూజ్ లేదా అతని ప్రతినిధుల నుంచి ఎలాంటి అధికారిక స్పందన గానీ, ధ్రువీకరణ గానీ రాలేదని సమాచారం.

### ఆగస్టు 13 నుంచి ‘ది ట్రెయిటర్స్ 2’

ప్రముఖ రియాలిటీ షో ‘ది ట్రెయిటర్స్’ మొదటి సీజన్ విజయవంతం కావడంతో, ఇప్పుడు రెండవ సీజన్ రాబోతోంది. కరణ్ జోహార్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షో ఈ నెల 13 నుంచి ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా ప్రసారం కానుంది. ఇది ఒక స్ట్రాటజీ ఆధారిత గేమ్ షో. ఇందులో కంటెస్టెంట్లను రహస్యంగా ‘ఫెయిత్‌ఫుల్స్’, ‘ట్రెయిటర్స్’గా విభజిస్తారు. మోసం, వ్యూహాలు, పొత్తుల ద్వారా చివరికి విజేతను నిర్ణయిస్తారు. ఈ సీజన్‌లో మల్లికా శెరావత్‌తో పాటు మునవర్ ఫరూఖీ, శ్వేతా తివారీ, రియా చక్రవర్తి, క్రిస్టల్ డిసౌజా, దలీప్ తాహిల్, అభిషేక్ మల్హాన్ వంటి పలు రంగాలకు చెందిన ప్రముఖులు కంటెస్టెంట్లుగా పాల్గొంటున్నారు. మొత్తం మీద షో ప్రసారం కాకముందే మల్లికా వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా దీనిపై ఆసక్తి నెలకొంది.


# ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ‘స్పైడర్ మ్యాన్’ విధ్వంసం..
# 12 రోజుల్లోనే రూ. 500 కోట్ల కలెక్షన్స్!

హాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ ‘స్పైడర్ మ్యాన్’ సిరీస్ నుంచి వచ్చిన తాజా చిత్రం ‘స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే’ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త వసూళ్లతో దూసుకుపోతోంది. టామ్ హాలండ్, జెండాయా జంటగా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగానే కాకుండా, మన దేశంలోనూ ఊహించని రీతిలో వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 12,000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం, ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. తాజాగా ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, ఇంగ్లీష్ భాషల్లో కలిపి భారతీయ మార్కెట్‌లో రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. దీంతో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సినిమాలకు భారతదేశంలో ఉన్న క్రేజ్ మరోసారి నిరూపితమైంది. వీకెండ్‌లోనే కాకుండా వీక్‌డేస్‌లో కూడా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. రెండో వారంలోనూ వసూళ్ల జోరు ఏమాత్రం తగ్గకపోగా, మొత్తం గ్రాస్ కలెక్షన్లు త్వరలోనే రూ. 520 కోట్లకు చేరుకుంటాయని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. త్వరలో కొన్ని కొత్త చిత్రాలు విడుదల కానున్నప్పటికీ, వాటిని తట్టుకుని ఈ సినిమా ఫుల్ రన్‌లో సులభంగా రూ. 600 కోట్ల గ్రాస్ మరియు రూ. 500 కోట్ల నెట్ వసూళ్లను సాధిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు భారతదేశంలో ఈ సినిమాను దాదాపు 1.7 కోట్ల మంది ప్రేక్షకులు వీక్షించారు. త్వరలోనే ఈ సంఖ్య 2 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.




గతంలో మన దేశంలో హాలీవుడ్ నుంచి కేవలం ‘టైటానిక్’, ‘అవెంజర్స్: ఎండ్‌గేమ్’ చిత్రాలను మాత్రమే 2 కోట్ల మందికి పైగా థియేటర్లలో చూశారు. ఇప్పుడు ‘స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే’ కూడా ఆ అరుదైన రికార్డుకు చేరువలో దూసుకుపోతోంది. ఈ విజయంతో ట్రేడ్ పండితులు దీన్ని ‘ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్’గా ప్రకటించారు.

# బహుజన ధీరుడు సర్వాయి పాపన్న



చారిత్రక వీరుడు, బహుజన చక్రవర్తిగా కీర్తిపొందిన సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన చిత్రం ‘సర్దార్ సర్వాయి పాపన్న’. స్వీయ దర్శకనిర్మాణంలో వెంకటేష్ గౌడ్ లింగంపల్లి తెరకెక్కించారు. ఆర్కే ఫిలింస్ ద్వారా ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ చిత్రాన్ని ఈ నెల 21న థియేట్రికల్ రిలీజ్ చేయబోతున్నారు. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ..బహుజనుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన వీరత్వానికి అద్దంపట్టే చిత్రమిదని అన్నారు.సర్వాయి పాపన్న అణగారిన వర్గాల నుంచి పుట్టిన వీరుడని, ఔరంగాజేబ్, నిజాం నవాబులకు ఎదురొడ్డి 30ఏళ్లు స్వతంత్ర్య రాజుగా పాలన సాగించారని, ఢిల్లీకే సవాలు విసిరిన యోధుడు ఆయన అని దర్శకనిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా, విజువల్ డైరెక్షన్: మిర్జాపురి సైమన్, మ్యూజిక్ సూపర్‌వైజర్, సాహిత్యం, నిర్మాత, దర్శకత్వం: వెంకటేష్ గౌడ్ లింగంపల్లి.

# నాన్‌స్టాప్ నవ్వులు గ్యారెంటీ!



‘నేను సరైన కామెడీ సినిమా చేసి పదేళ్లవుతున్నది. ‘నాంది’ తర్వాత కొన్ని సీరియస్ సినిమాలు చేశాను. కానీ కామెడీని ఎప్పుడూ వదిలిపెట్టలేదు. పదేళ్లుగా మీరు మిస్ అయ్యారనుకున్న నరేష్‌ను ఇందులో చూస్తారు. రెండున్నర గంటల పాటు మిమ్మల్ని నవ్వించే చిత్రమిదని గ్యారెంటీ ఇస్తున్నా’ అన్నారు అల్లరి నరేష్. ఆయన కథానాయకుడిగా నటించిన ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ ‘రంభ ఊర్వశి మేనక’. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. ఇంద్రలోకం నుంచి రంభ, ఊర్వశి, మేనక భూలోకంలోకి అడుగుపెడితే ఏం జరిగిందనే సంఘటనల నేపథ్యంలో టీజర్ ఆద్యంతం నవ్వుల్ని పంచింది.

ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ ‘నేను చిన్నప్పటి నుంచి నాగార్జునగారికి పెద్ద అభిమానిని. ‘నా సామిరంగా’లో ఆయనతో కలిసి నటించా. ఇప్పుడు ఆయన బ్యానర్‌లో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నా’ అన్నారు. ఈ సినిమా థియేటర్లలో నవ్వులమోత మోగిస్తుందని, అన్నపూర్ణ స్టూడియోస్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ బ్యానర్‌తో కలిసి సినిమా చేయడం ఆనందంగా ఉందని నిర్మాత రాజేష్ దండా పేర్కొన్నారు. ఫాంటసీ, గ్రామీణ నేపథ్యాన్ని కలిపి ప్రేక్షకుల్ని నవ్వించాలనే లక్ష్యంతో సినిమా చేశామని దర్శకుడు చంద్రమోహన్ చింతాడ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## మానవబంధాలపై తీసిన
# గొప్ప సినిమా



‘తెలుగువారితో నాది 28ఏండ్ల బంధం. వారిని దృష్టిలో పెట్టుకొనే ఈసినిమా చేశాను. మానవబంధాలపై తీసిన గొప్ప సినిమా ఇది. నా కెరీర్‌లోనే ఇది ప్రత్యేకం. ‘గజనీ’ నాటి ఎనర్జీని మళ్లీ ఈ సినిమాలో చూస్తారు. సిన్సియర్ డైరెక్టర్ వెంకీ అట్లూరి. ముఖ్యంగా తను గొప్ప రచయిత. అద్భుతమైన పాత్రలను సృష్టించారు. నిర్మాతలు ఓ అందమైన ప్రపంచాన్నే ఆవిష్కరించారు. టీమ్ అంతా ప్రేమతో పనిచేశారు. ‘సూర్య సన్నాఫ్ కృష్ణన్’ని తెలుగు ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకున్నారు. అలాగే ఈ ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ని కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నా’ అని అగ్ర నటుడు సూర్య అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన పాన్ ఇండియా ఫ్యామిలీ డ్రామా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’. మమితాబైజు కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో సూర్య మాట్లాడారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ‘నమ్మకంగా చెబుతున్నా. ఈ సినిమా చూస్తున్నంతసేపూ ఆడియన్ ముఖంపై చిన్న చిరునవ్వు కచ్చితంగా ఉంటుంది. సినిమా ఇంతబాగా రావడానికి పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. 20ఏండ్లుగా సూర్యసార్ సినిమాలు చూస్తూ ఎదిగాను. ఇప్పుడు ఆయనతో సినిమా చేశాను. ఇది నేను ఓ ఫ్యాన్ బోయ్‌గా చేసిన సినిమా’ అని చెప్పారు. ‘సూర్యసార్‌తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నా. ఆయనతో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అద్భుతమైన టీమ్‌తో పనిచేసే అవకాశం ఇచ్చిన దర్శక,నిర్మాతలకు కృతజ్ఞతలు’ అన్నారు కథానాయిక మమితాబైజు. ఇంకా చిత్ర నిర్మాతలతోపాటు రాధిక శరత్‌కుమార్, కె.ఎల్.నారాయణ, మైత్రి రవిశంకర్, శాసనసభ్యులు నవీన్ యాదవ్, రామజోగయ్యశాస్త్రి, సునీల్‌రెడ్డి, బీవీఎస్ఎన్ రవి, విజయ్ బిన్నీ, హైపర్ ఆది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉప్పాడకు ఉక్కు కవచం

**- ఐఐటీ-మద్రాస్‌తో ఎంవోయూ.. రూ.323 కోట్లతో తీర రక్షణ గోడ**
**- నవంబర్ నుంచి పనులు.. శాస్త్రీయ అధ్యయనాలతో పటిష్ఠమైన డిజైన్**
**- పవన్‌కల్యాణ్ సమక్షంలో ఒప్పందం**



**కాకినాడ(ప్రశ్న న్యూస్ )** సముద్ర కోతతో ఏళ్లుగా తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంతానికి రక్షణ కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. తీర ప్రాంతాన్ని సముద్ర కోత నుంచి కాపాడేందుకు రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ-మద్రాస్‌కు అప్పగించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది.

## సముద్ర కోతకు శాస్త్రీయ పరిష్కారం

ఉప్పాడ తీరంలో ఏళ్లుగా కొనసాగుతున్న సముద్ర కోత కారణంగా తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాలపై ముప్పు పెరుగుతోంది. సముద్రం ముందుకు చొచ్చుకురావడంతో తీర ప్రాంత భూములు కోతకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా.. శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా శాశ్వత పరిష్కారం చూపేలా రక్షణ ప్రాజెక్టును చేపట్టనున్నారు.తీర ప్రాంత స్వభావం, సముద్ర ప్రవాహాలు, అలల తీవ్రత, తీర కోత వేగం తదితర అంశాలను ఐఐటీ-మద్రాస్ నిపుణులు సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. ఈ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీరానికి అనువైన రక్షణ నిర్మాణాలను డిజైన్ చేయనున్నారు.

## డీపీఆర్ నుంచి పర్యవేక్షణ వరకు

ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఐఐటీ-మద్రాస్ సిద్ధం చేయనుంది. రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను పరిశీలించి, తీర పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ నమూనాను రూపొందించనున్నారు. నిర్మాణ పనుల సమయంలోనూ సాంకేతిక పర్యవేక్షణ అందించనున్నారు.
దీంతో ప్రాజెక్టు అమలులో శాస్త్రీయ ప్రమాణాలకు ప్రాధాన్యం లభించనుంది. తీర ప్రాంత భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణాన్ని చేపట్టే అవకాశం ఉంటుంది.

## రూ.323 కోట్లతో రక్షణ గోడ

కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి(ఎన్‌డీఎంఎఫ్) ఆమోదంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మొత్తం రూ.323 కోట్ల అంచనా వ్యయంతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం జరగనుంది. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ(ఎస్‌డీఎంఏ) ఈ ప్రాజెక్టుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వర్తించనుంది.

# 1972--73 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్‌లోని జెడ్ ఫి హెచ్ ఎస్ పాఠశాల 1972--73 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గౌడవెల్లి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని వేముల ఇంద్రారెడ్డి, వెంకటరెడ్డి, మాధవరెడ్డి, రాంమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశలోని అనుభవాలు, పాఠశాల జ్ఞాపకాలు, అప్పటి మిత్రులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేస్తే డబ్బు రికవరీకి అవకాశం గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణి బ్రేకర్స్ మద్రాస్‌లో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ, డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సీఐ రవికుమార్ మాట్లాడుతూ సాంకేతికతను సానుకూలంగా వినియోగించుకోవడంతో పాటు దాని వెనుక ఉన్న ముప్పులను గుర్తించడం ఎంతో అవసరమన్నారు. సైబర్ ఆర్థిక మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మోసం జరిగిన మొదటి గంటలోనే ఫిర్యాదు చేస్తే డబ్బును తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.
వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే గుర్తుతెలియని లింక్‌లు, ఏపీకే ఫైళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. వాటి ద్వారా సైబర్ నేరగాళ్లు మొబైల్‌ను తమ ఆధీనంలోకి తీసుకుని బ్యాంకు ఖాతాల్లోని డబ్బును దోచుకునే ప్రమాదం ఉందన్నారు.బ్యాంకు అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, కస్టమర్ కేర్ ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, పిన్ నంబర్, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు.పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, టాస్క్ ఆధారిత ఆదాయాలు, విద్యుత్ బిల్లుల బకాయిలు, కొరియర్ పార్సెల్ నిలిచిపోయిందంటూ వచ్చే నకిలీ కాల్స్, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామనే ఆన్‌లైన్ ప్రకటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండటమే మొదటి రక్షణ అని సీఐ రవికుమార్ పేర్కొన్నారు. ఏదైనా అనుమానం కలిగినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని ఆయన ప్రజలకు సూచించారు.

# హెడ్ కానిస్టేబుల్‌పైనే దౌర్జన్యం..
# కత్తితో పొడుస్తానంటూ బెదిరింపులు

**- శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీపై విచారణకు వెళ్తుండగా ఘటన - రోడ్డు ప్రమాదం.. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన హెడ్ కానిస్టేబుల్**
**- వాహనాల తాళాలు తీసుకుని స్టేషన్‌కు రావాలని సూచించడంతో యువకుల వీరంగం - ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్)** విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిపైనే ఇద్దరు యువకులు దౌర్జన్యానికి దిగిన ఘటన శ్రీకాళహస్తిలో కలకలం రేపింది. సెల్‌ఫోన్ చోరీ కేసు విచారణలో భాగంగా రైల్వేస్టేషన్‌కు వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి గురైన వాహనాలను పరిశీలించి, వాటి తాళాలు తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించగా ఇద్దరు యువకులు తీవ్ర ఆగ్రహానికి గురై హెడ్ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా దౌర్జన్యానికి పాల్పడి, కత్తితో పొడుస్తానంటూ బెదిరించినట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

## సెల్‌ఫోన్ చోరీపై విచారణకు..

శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై విచారణ చేపట్టేందుకు హెడ్ కానిస్టేబుల్ రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో అనూహ్యంగా మరో ఘటన ఎదురైంది.

## ఎదురెదురుగా ఢీకొన్న బైకులు

హెడ్ కానిస్టేబుల్ వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో పలువురు గాయపడినట్లు గుర్తించిన ఆయన వెంటనే స్పందించారు. క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. పోలీసు విధులతో పాటు ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ సాయం అందించారు.
ప్రమాదానికి కారణాలు, వాహనాల వివరాలు, ఘటనలో పాల్గొన్న వ్యక్తుల వివరాలు తెలుసుకునే క్రమంలో వాహనాల తాళాలు తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు రావాలని హెడ్ కానిస్టేబుల్ సూచించినట్లు తెలుస్తోంది.

## ఒక్కసారిగా యువకుల వీరంగం

వాహనాల తాళాలు తీసుకుని స్టేషన్‌కు రావాలని సూచించడంతో ఇద్దరు యువకులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. హెడ్ కానిస్టేబుల్‌తో యువకులు దురుసుగా ప్రవర్తిస్తూ దౌర్జన్యానికి దిగినట్లు తెలుస్తోంది.పోలీసు విధుల్లో ఉన్న అధికారికి సహకరించాల్సిన వారు అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో అక్కడున్నవారు విస్తుపోయినట్లు సమాచారం.

## "కత్తితో పొడుస్తా.."

వాగ్వాదం మరింత ముదరడంతో యువకుల్లో ఒకరు కత్తితో పొడుస్తానంటూ హెడ్ కానిస్టేబుల్‌ను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని బహిరంగంగా బెదిరించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఘటనపై సమాచారం అందుకున్న ఇతర పోలీసులు అక్కడికి చేరుకుని



పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# ప్రారంభానికి సీడ్ యాక్సెస్ రోడ్డు సిద్ధం!

**- నేడు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**
**- స్టీల్ బ్రిడ్జిలతో కీలక అనుసంధానం.. ట్రాఫిక్, బందోబస్తుపై పకడ్బందీ ఏర్పాట్లు**

**గుంటూరు(ప్రశ్న న్యూస్ )** రాజధాని అమరావతిలో మరో కీలక మౌలిక వసతి సౌకర్యం ప్రారంభానికి సిద్ధమైంది. సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వీటిని ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి బుధవారం పరిశీలించారు.

## రహదారికి కొత్త ఊపు

రాజధాని ప్రాంతంలో రాకపోకలను మరింత సులభతరం చేసేలా సీడ్ యాక్సెస్ రోడ్డు కీలకంగా మారనుంది. ప్రధాన ప్రాంతాలను అనుసంధానించే ఈ రహదారి అందుబాటులోకి రావడంతో రాజధాని ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. రహదారితో పాటు నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలు కూడా ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

## సభకు ఏర్పాట్లు

రోడ్డు, స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. సభా ప్రాంగణంలో వేదిక, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చునే ప్రదేశాలు, వాహనాల రాకపోకలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ఎమ్మెల్యేల నివాసాల పరిశీలన

ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి శాసన సభ్యుల నివాస గృహ సముదాయాలను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కూడా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన మార్గాలు,



భద్రతా ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు.

## ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపులపై ప్రణాళిక రూపొందించారు. పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వాహనాలను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పోలీసు అధికారులకు సూచించారు.

## పటిష్ఠ బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలను కేటాయించారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గాలు, సభా ప్రాంగణం, ప్రారంభోత్సవ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాల్లో భద్రతా చర్యలను సమన్వయం చేస్తున్నారు.

## సమన్వయంతో ఏర్పాట్లు

కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. రోడ్లు, బ్రిడ్జిలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, బందోబస్తు తదితర అంశాల్లో ఆయా శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ఎం.టి.ఎం.సీ కమిషనర్ అలీం భాషా, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, అదనపు ఎస్పీ రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.సీడ్ యాక్సెస్ రోడ్డు.. స్టీల్ బ్రిడ్జిల ప్రారంభంతో రాజధాని అమరావతి అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడనుంది. ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

# తెలుగుదేశం ఇంటింటి ప్రచారానికి భారీ ప్రజాస్పందన

**- పత్రికా విలేకరుల సమావేశంలో బద్వేలు నియోజకవర్గ టిడిపి పరిశీలకుడు తుగ్గలి నాగేంద్ర**



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి గారు, టీడీపీ బద్వేలు నియోజకవర్గం పరిశీలకుడు తుగ్గలి నాగేంద్ర ఆధ్వర్యంలో బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.2 ఏళ్ల కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ పేదలు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రూ.4,000, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని అన్నారు.మెగా డీఎస్సీ అంటేనే తెలుగుదేశం పార్టీ అని శ్రీ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీపై సంతకం చేసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి తన చిత్తశుద్ధిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాటుకున్నారని తెలిపారు.×గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులను మోసం చేసి, ఉద్యోగాల భర్తీ విషయంలో నిర్లక్ష్యం చేసిన నాయకులు.. నేడు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి మెగా డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తే వాటి పై లేనిపోని ఆరోపణలు చేస్తూ రాద్ధాంతం చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి కుటుంబాల్లో భరోసా నింపిందని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులే "కూటమి ప్రభుత్వం మా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి మాకు భరోసా కల్పించింది" అని చెబుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా, వారికి ఉద్యోగాలు కల్పించే ప్రభుత్వ కార్యక్రమాలను స్వాగతించాలని వైకాపా నాయకులకు సూచించారు.ం
యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగులకు అండగా నిలవడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంచూరు సూర్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు అదేవిధంగా, బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్తను, పార్టీ నాయకులను కలుపుకొని ముందుకు సాగుతూ, బద్వేలు నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందే విధంగా కృషి చేసి టీడీపీకి మరింత బలాన్ని తీసుకువస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గిరిజన బిడ్డ (మీ) కోసం పోరాడుతున్న RTv

## – జర్నలిస్ట్ నిర్మల రిపోర్టింగ్ ఆదర్శం

(అనంచిన్ని వెంకటేశ్వరరావు, ప్రముఖ పరిశోధన పాత్రికేయులు, 9440000009)

హైదరాబాద్: ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జె.సాయి కుమార్ ఈరోజు తెల్లవారుజామున 2.30 గంటలకు ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలోని రెస్ట్ రూమ్‌లో ఉరి వేసుకున్నట్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 2024 బ్యాచ్‌కు చెందిన సాయికుమార్‌ను.. ప్రస్తుతం ఈ–కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కర్మన్‌ఘాట్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మరో వైపు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సాయికుమార్ ఆత్మహత్య చేసుకోలేదని, రక్తపు మరకలు ఎలా వచ్చాయని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వందలాది మంది పీఎస్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఒక దశలో పీఎస్‌లోకి దూసుకెళ్లి కంప్యూటర్, ప్రింటర్ ధ్వంసం చేశారు. ఉద్రిక్తత నెలకొనడంతో భారీగా పోలీసుల మోహరించారు.
























# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

## – సుమోటోగా కోర్టు ధిక్కరణ నోటీసులు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కోర్టు స్టే ఉత్తర్వులు అమలులో ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్తులను కూల్చివేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ డిజాస్టర్ అండ్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ధిక్కరణ చర్యలను సుమోటోగా స్వీకరించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తూ, రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మండలంలోని వాణి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పరిధిలో (సర్వే నెం. 194/1, 211) కోర్టు స్టే ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి, తిరుమలగిరి తహసీల్దార్లు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, తమ అనుమతి లేకుండానే మేడ్చల్ జిల్లాలో హైడ్రా దాదాపు 40 కూల్చివేతలు చేపట్టిందని కలెక్టర్ న్యాయస్థానానికి నివేదించారు.

దీనిపై హైడ్రా తరపు న్యాయవాది స్పందిస్తూ, రెవెన్యూ శాఖ సూచనల మేరకే జీఎల్ఆర్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అయితే, సరైన రికార్డులను పరిశీలించకుండా ఏకపక్షంగా కూల్చివేతలు చేపట్టడం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. హైడ్రా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ వద్ద ఉన్న కోర్టు స్టే ఉత్తర్వుల వివరాలను తక్షణమే హైడ్రాకు తెలియజేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ విషయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించింది. హైడ్రా ఏర్పాటుకు ముందు జారీ అయిన స్టే ఉత్తర్వులను సైతం ఆ సంస్థ పరిగణనలోకి తీసుకోవడం లేదని పలు ఫిర్యాదులు వస్తున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.

# జిమ్‌ల మాటున 'ఫిట్‌నెస్' దందా.?

- వెంటిలేషన్ నుంచి భద్రత వరకు పర్యవేక్షణ ఎక్కడ.?
- అర్హతలేని ట్రైనర్లతో శిక్షణా.?
- సప్లిమెంట్ల వినియోగంపై నిఘా ఏదీ.?
- మైనర్లు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- అనుమతులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లపై తనిఖీలు తప్పనిసరి

(తోట.వెంకట్ -- ఏపీ, తెలంగాణ, ప్రశ్న న్యూస్ బ్యూరో)



యువతలో ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెరుగుతోంది. శారీరక దారుఢ్యం, ఆరోగ్యం, ఆకర్షణీయమైన శరీరాకృతి కోసం పెద్ద సంఖ్యలో యువత జిమ్‌లను ఆశ్రయిస్తోంది. ఇదే సమయంలో పట్టణాలు, నగరాల్లో గల్లీకి ఒకటి చొప్పున జిమ్‌లు వెలుస్తున్నాయి. సభ్యత్వ రుసుముల వసూళ్లు జోరుగా సాగుతున్నా.. ఆయా జిమ్‌లలో భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, ట్రైనర్ల అర్హతలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై సమగ్ర పర్యవేక్షణ ఉందా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిట్‌నెస్ కేంద్రాలు నిర్వహించడం కేవలం వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేసి సభ్యులను చేర్చుకోవడంతో పూర్తయ్యే వ్యవహారం కాదు. అక్కడికి వచ్చే వారి వయస్సు, శారీరక స్థితి, వ్యాయామ సామర్థ్యం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, అగ్నిప్రమాద నివారణ చర్యలు, పరిశుభ్రత, గాలి ప్రసరణ వంటి అనేక అంశాలు కీలకం. ముఖ్యంగా యువత అధికంగా వచ్చే కేంద్రాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది.

### మూసివేసిన గదుల్లో వ్యాయామం.. గాలి సంగతేంటి.?

చాలా జిమ్‌లు భవనాల లోపలి భాగాల్లో, పరిమిత విస్తీర్ణంలో నిర్వహిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గంటల తరబడి పలువురు ఒకే చోట వ్యాయామం చేసే సమయంలో సరైన వెంటిలేషన్ లేకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఎయిర్‌కండిషనింగ్ లేదా ఫ్యాన్లు ఉండటం మాత్రమే సరిపోదు. గాలి ప్రసరణకు సరైన వ్యవస్థ ఉందా.? పరిశుభ్రమైన వాతావరణం ఉందా.? జిమ్ నిర్వహణలో వీటికి ప్రాధాన్యం ఇస్తున్నారా.? అన్నది పరిశీలించాల్సిన అంశం.

### సీసీ కెమెరాలు.. భద్రతా ప్రమాణాలు ఎక్కడ.?

జిమ్‌లలో సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం చాలా ఉంది. ముఖ్యంగా మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో ఫిట్‌నెస్ కేంద్రాలను ఉపయోగిస్తున్న నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రవేశ--నిష్క్రమణ ప్రాంతాల్లో భద్రత, అత్యవసర సమయంలో సిబ్బంది స్పందించే విధానం వంటి అంశాలు కీలకం.కెమెరాలు ఏర్పాటు చేసినా అవి పనిచేస్తున్నాయా.? రికార్డింగ్ వ్యవస్థ సక్రమంగా ఉందా.? 3 నెలల వరకు రికార్డింగ్ భద్రపరిచే సిస్టం ఉందా.? సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా కెమెరాలను సరైన ప్రదేశాల్లోనే ఏర్పాటు చేస్తున్నారా.? అనే అంశాలపైనా పర్యవేక్షణ అవసరం.

### మైనర్ల విషయంలో ప్రత్యేక నియంత్రణ అవసరం..

ఫిట్‌నెస్‌పై ఆసక్తితో మైనర్లు కూడా జిమ్‌లకు వెళ్తున్నారు. అయితే వారి వయస్సుకు తగ్గ వ్యాయామం, శిక్షణ, పరికరాల వినియోగం ఉండాలి. పెద్దలకు ఉపయోగించే అన్ని వ్యాయామ పద్ధతులను మైనర్లకు కూడా వర్తింపజేస్తున్నారా.? వారి శారీరక సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారా.? తల్లిదండ్రుల సమ్మతి, తగిన శిక్షణ వంటి అంశాలను జిమ్ నిర్వాహకులు పాటిస్తున్నారా.? అన్నది పరిశీలించాలి.యువతలో త్వరగా శరీరాకృతి మార్చుకోవాలనే ఉత్సాహం ఎక్కువగా ఉండటంతో అనుభవం లేని వ్యక్తుల సలహాలను అనుసరించే పరిస్థితి ఏర్పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం జిమ్ నిర్వాహకులకు ఉండాలి.

### మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి ఎక్కడ.?

మహిళల కోసం ప్రత్యేక విభాగాలు నిర్వహించే జిమ్‌లు కూడా పెరుగుతున్నాయి. అయితే మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయా.? మహిళా ట్రైనర్లు అందుబాటులో ఉన్నారా.? మారుతున్న సమయంలో సిబ్బంది పర్యవేక్షణ ఎలా ఉంది.? అత్యవసర పరిస్థితుల్లో ఫిర్యాదు చేసేందుకు సరైన వ్యవస్థ ఉందా.? అనే అంశాలను అధికారులు పరిశీలించాలి.అంతేకాకుండా మహిళలు వ్యాయామం చేసే ప్రదేశాల్లో కెమెరాల ఏర్పాటు విషయంలో గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. భద్రత పేరుతో గోప్యతకు భంగం కలిగేలా వ్యవస్థలు ఏర్పాటు కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం.

### ఫీజులు మాత్రం భారీగా.. సౌకర్యాలు అంతంతేనా.?

నెలవారీ, త్రైమాసిక, వార్షిక సభ్యత్వాల పేరుతో జిమ్‌లు వివిధ రకాల ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రత్యేక శిక్షణ పేరుతో అదనపు రుసుములు కూడా తీసుకుంటున్నారు. సభ్యుల నుంచి రుసుములు వసూలు చేస్తున్నప్పుడు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారావి? పరికరాల నిర్వహణ సక్రమంగా ఉందా.? తాగునీరు, పరిశుభ్రత, శౌచాలయాలు, గాలి ప్రసరణ వంటి సదుపాయాలు ఉన్నాయా.? అన్నది వినియోగదారుల హక్కుల కోణంలోనూ పరిశీలించాల్సిన అవసరం ఉంది.సభ్యత్వం తీసుకునే ముందు జిమ్‌లో ఉన్న సౌకర్యాలు, ఫీజులు, నిబంధనలు, రద్దు విధానం వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం నిర్వాహకులకు ఉంది.

### 'ఫిట్‌నెస్ సర్టిఫికెట్'లపై తనిఖీ ఉందా.?

జిమ్‌లలో ఉపయోగించే పరికరాలు, విద్యుత్ వ్యవస్థలు, భవన భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లకు సంబంధించిన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయా.? అన్నది కీలక ప్రశ్న. ఎక్కడైనా అనుమతులు లేదా ధ్రువపత్రాలు అవసరమైతే అవి నిజమైనవేనా.? గడువు ముగిసిన పత్రాలతో కార్యకలాపాలు కొనసాగుతున్నాయా.? అన్నది సంబంధిత అధికారులు తనిఖీ చేయాలి.'ఫిట్‌నెస్ సర్టిఫికెట్' పేరుతో ఏవైనా నకిలీ పత్రాలు ఉపయోగిస్తున్నారన్న అనుమానాలు ఉంటే వాటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత అధికారులదే.

### అనుమతులు లేకుండానే నిర్వహణ.?

కొత్త జిమ్ ప్రారంభించేందుకు ప్రభుత్వ స్థానిక సంస్థల అనుమతులు, భవన వినియోగ నిబంధనలు, అగ్నిమాపక భద్రత, వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించిన అనుమతులు తదితర అంశాలు వర్తించే ప్రాంతాల్లో అవి పాటిస్తున్నారా.? అన్నది కచ్చితంగా పరిశీలించాలి.ఒక భవనాన్ని ఒక ప్రయోజనం కోసం అనుమతులు తీసుకుని మరో ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారా.? పరిమిత విస్తీర్ణంలో అధిక సంఖ్యలో సభ్యులను చేర్చుకుంటున్నారా.? పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయా.? వంటి అంశాలపైనా ప్రభుత్వ సంస్థలు దృష్టి పెట్టాలి.

### అధికారుల తనిఖీలు ఎప్పుడు.?

జిమ్‌లు ప్రారంభించిన తర్వాత వాటి నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉందా.? అధికారులు చివరిసారిగా ఎప్పుడు తనిఖీ చేశారు.? తనిఖీల్లో ఏ లోపాలు గుర్తించారు.? వాటిని సరిదిద్దాలని ఎప్పుడైనా నోటీసులు ఇచ్చారా.? నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకున్నారా.? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకొస్తున్నాయి.జిమ్‌లపై ఏదైనా ప్రమాదం లేదా ఫిర్యాదు వచ్చిన తర్వాత మాత్రమే అధికారులు స్పందించే పరిస్థితి కాకుండా.. ముందస్తు తనిఖీల వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉంది.



### సప్లిమెంట్ల మోజులో యువత..

త్వరగా కండలు పెంచుకోవాలనే కోరికతో కొందరు యువత మార్కెట్లో లభించే వివిధ సప్లిమెంట్లను ఉపయోగిస్తున్నారు. ప్రతి సప్లిమెంట్ ప్రతి వ్యక్తికి అనుకూలం కాకపోవచ్చు. ముఖ్యంగా వైద్యులు లేదా అర్హత కలిగిన పోషకాహార నిపుణుల సలహా లేకుండా ఏదైనా ఉత్పత్తిని తీసుకోవడం పట్ల జాగ్రత్త అవసరం.జిమ్ ట్రైనర్ సలహా ఇచ్చారనే కారణంతోనే ఏదైనా సప్లిమెంట్‌ను ఉపయోగించడం సరికాదని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, వ్యాయామ స్థాయి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అనుమానాస్పద ఉత్పత్తులు, తెలియని మూలాల నుంచి వచ్చే పదార్థాల విషయంలో మరింత అప్రమత్తత అవసరం.

### ఫలితం కోసం షార్ట్‌కట్.. ప్రమాదానికి ఆహ్వానమా.?

కొద్ది రోజుల్లోనే భారీగా కండలు పెంచుకోవాలని, బరువు తగ్గాలని యువతలో కొందరు ఆతృత చూపుతున్నారు. ఫలితాలు త్వరగా రావాలనే ఉద్దేశంతో శాస్త్రీయంగా నిరూపించని పద్ధతులు, అధిక వ్యాయామం, నియంత్రణలేని ఆహార పద్ధతులు అనుసరించే ప్రమాదం ఉంది.
జిమ్ నిర్వాహకులు కూడా సభ్యులను ఆకట్టుకునేందుకు 'త్వరిత ఫలితాలు' అనే ప్రచారానికి బదులుగా సురక్షితమైన వ్యాయామ విధానాలపై అవగాహన కల్పించాలి.

### ట్రైనర్ అర్హతలపై స్పష్టత కావాలి

జిమ్‌లో పనిచేసే ప్రతి వ్యక్తి వైద్యుడు కాదు. శారీరక వ్యాయామానికి సంబంధించిన సరైన శిక్షణ, ప్రాథమిక అత్యవసర పరిజ్ఞానం ఉన్న సిబ్బంది అందుబాటులో ఉండటం ప్రయోజనకరం. సభ్యులకు వ్యాయామం సూచించే వ్యక్తుల అర్హతలు ఏమిటి.? శిక్షణ పొందారా.? అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ స్పందనపై అవగాహన ఉందా.? అనే వివరాలను స్పష్టంగా ఉంచాల్సిన అవసరం ఉంది.

### జిమ్‌లకు నియంత్రణ వ్యవస్థ ఎక్కడ.?

ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంగా జిమ్‌ల నిర్వహణను కూడా చూడాల్సిన అవసరం ఉంది. రిజిస్ట్రేషన్, భవన భద్రత, అగ్నిమాపక ప్రమాణాలు, విద్యుత్ భద్రత, పరిశుభ్రత, వెంటిలేషన్, ట్రైనర్ల అర్హతలు, సభ్యుల భద్రత వంటి అంశాలపై సంబంధిత విభాగాలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలి.
జిమ్‌లపై ఫిర్యాదులు వస్తే స్పందించడం మాత్రమే కాకుండా.. నిర్దిష్ట కాల వ్యవధిలో తనిఖీలు నిర్వహించి లోపాలను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలు పాటించే జిమ్‌లను ప్రోత్సహిస్తూ, తీవ్రమైన ఉల్లంఘనలు చేసే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిమ్‌కు వెళ్లడం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి.. ఆరోగ్యాన్నే ప్రమాదంలోకి నెట్టడానికి కాదు. ఫిట్‌నెస్ కేంద్రాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ వాటి నిర్వహణపై పర్యవేక్షణ కూడా పెరగాలి. యువత ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అంశంలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588